నమ్మలేని నిజాలు

మీసాల నేత
కవిచౌడప్ప పద్యం
సత్యవచనం
డబ్బు నాశనం
కొత్త నేతల దృష్టి
కీర్తి దప్పిక.
నీతుల పుట్ట
పాములతావుకాదు
శ్రమచీమలు.
ఆటల మేటి
పాదాలబంతి ఆట
భారత్ లో మెస్సీ.
కవితా వాణి
జనచైతన్యజ్వాల
ఖైదు చేయండి.



- రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

శ్రీనిజాలు

గాడి తప్పి పోతుందా
రాష్ట్ర కాంగిరేస్ సర్కార్ ?
పడకుండా ఆపేందుకు
ఎవడూ లేడా దార్కార్ ?
ఎటుచూసిన పరిపాలన
కుక్కలు చింపిన విస్తరి !
అస్తిత్వపు తెలంగాణ
ఇక కట్టినట్టె బిస్తరి !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 22-1-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:136 పేజిలు:6 వెల: రూ.1/-


## తెలంగాణకు 1,000 కోట్ల పెట్టుబడులు.. దావోస్‌లో సర్కార్ కీలక ఒప్పందం



దావోస్, జనవరి 21: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ 2026 సదస్సు సందర్భంగా అమెరికాకు చెందిన సరడ్ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం కీలక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం రేవంత్ రెడ్డితో ఆ సంస్థ సీఈఓ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ముందుకు వచ్చింది. రాబోయే 3 నుంచి 5 సంవత్సరాల్లో రూ.1,000 కోట్ల పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఎమ్ఆర్ఓ కేంద్రాన్ని వరంగల్ లేదా ఆదిలా బాద్‌లో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. దీంతో రాష్ట్రం.. విమానయాన, ఏరోస్పేస్ రంగాల్లో మరింత బలోపేతమయ్యే అవకాశం ఉంది.

**బ్లైజ్ కంపెనీతో ఎంఓయూ..**

అలాగే.. కాలిఫోర్నియా కేంద్రంగా ఉన్న బ్లైజ్ కంపెనీతో మరో ఎంఓయూ కుదిరింది. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వేదికపై సీఎం రేవంత్ రెడ్డితో బ్లైజ్ సీఈఓ దినాకర్ మునగాలా సమావేశమయ్యారు. హెల్త్‌కేర్, మాన్యుఫ్యాక్చరింగ్, ఎనర్జీ రంగాల్లో ఎఐ పైలట్ ప్రాజెక్టులపై చర్చలు జరిగాయి. తక్కువ విద్యుత్ వినియోగంతో AI హార్డ్‌వేర్, ఫుల్-స్టాక్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో బ్లైజ్ సంస్థ అగ్రగామి. ఈ ఒప్పందం ద్వారా హైదరాబాద్‌లో రీసెర్చ్ అండ్ డెవెలప్మెంట్ సెంటర్ విస్తరణకు బ్లైజ్ నిర్ణయం తీసుకుంది. ఈ ఒప్పందంతో తెలంగాణలో ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్, AI రంగాలకు ఊపిరి లభించనుంది. తెలంగాణను AI డేటా సెంటర్ హబ్‌గా మార్చడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ AI ఇన్నోవేషన్ హబ్ ప్రారంభంకానుందని మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు.

కాగా.. సీఎం రేవంత్.. జనవరి 20 నుంచి 23 వరకు దావోస్‌లోని డబ్ల్యూఈఎఫ్ 2026 సదస్సులో పాల్గొననున్నారు. జనవరి 19న మేడారంలో సమ్మక్క-సారలమ్మ దేవాలయాన్ని సందర్శించి పూజలు చేసిన అనంతరం, హైదరాబాద్ నుంచి స్విట్జర్లాండ్‌కు బయలుదేరారు సీఎం. జ్యూరిచ్ ఎయిర్‌పోర్ట్‌లో ఆయనకు తెలంగాణ డయాస్పోరా సభ్యులు ఘన స్వాగతం పలికారు. పర్యటనలో సీఎంతో పాటు ఐటీ, పరిశ్రమల మంత్రులు డి.శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రెటరీలు జయేశ్ రంజన్, సంజయ్ కుమార్, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను ప్రపంచ నాయకులు, సీఈఓల ముందు ప్రదర్శిం చడమే ప్రధాన లక్ష్యంగా రేవంత్ దావోస్ పర్యటన కొనసాగుతోంది.

## వీధి కుక్కల హత్యలపై యాచారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

హైదరాబాద్, జనవరి 21: ఇటీవల దేశ వ్యాప్తంగా వీధి కుక్కలపై దాడులు, వాటిని హతమార్చడం వంటి ఘటనలు తరచూ వెల్లువెత్తుతూనే ఉన్నాయి. ఈ ఘటనలపై పలుచోట్ల యానిమల్ లవర్స్ ఫిర్యాదులు చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా.. వీధి కుక్కలను హతమార్చిన ఘటనపై యాచారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సదరు గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం సుమారు 100 వీధి శునకాలను హతమార్చిన విషయం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై ఢిల్లీకి చెందిన 'స్ట్రే యానిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' వీధి కుక్కల సంరక్షణ ప్రతినిధులు యాచారం పోలీసు లకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల కామారెడ్డి, హన్మకొండ జిల్లాల్లోనూ వరుసగా కుక్కలను హతమార్చుతున్న వార్తలపై జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## మేడారం మహాజాతరకు సింగరేణి సన్నద్ధం..



వరంగల్, జనవరి 21:: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు సింగరేణి సమాయత్తమవుతోంది. ప్రతీ జాతర లాగానే ఈసారి కూడా జరిగే జాతరలో విధులు నిర్వర్తించేందుకు మూడు విభాగాల సిబ్బందిని సింగరేణి ఎంపిక చేసింది. జాతరకు వారం రోజుల ముందు నుంచి విధుల్లో చేరి జాతర పూర్తిగా ముగిసే వరకు పని చేసేందుకు ప్రణాళికలు రూపొందించు కున్నారు. ఇందులో భాగంగా మంగళవారం భూపాలపల్లి కేంద్రం నుంచి రెండు విభాగం తరలివెళ్లగా.. ఈ నెల 25వ తేదీన మరో విభాగం తరలివెళ్లేలా సిద్ధమవుతున్నారు.

సింగరేణి ఏరియాలో మూడు విభాగాల్లో పని చేస్తున్న 56 మందిని సింగరేణి యాజ మాన్యం ఎంపిక చేసింది.

వీరిలో రెస్క్యూ విభాగం నుండి 20మంది, స్విమ్మర్స్ 16 మంది, స్కౌట్స్ విభాగం నుండి 20 మంది జాతర లో విధులు నిర్వర్తించనున్నారు. వీరందరికి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. తల్లుల సన్నిధిలో సేవ చేసే భాగ్యం రావడం ఆనందంగా భావించాలని సూచించారు.



మేడారం జాతర సక్సెస్ కావాలంటే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే నే అది సాధ్యమవుతోంది.

అయితే, కొన్ని ప్రధాన శాఖల్లోని వారు ఎంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. వీరి విధుల నిర్వహణ తోనే వచ్చే భక్తులకు సేవలు అందనున్నాయి. అయితే, కొన్ని ప్రధాన శాఖల అధికారులు, సిబ్బంది మరింత సమర్థతతో పని చేయాల్సి ఉంటుంది. ఇదే తరహాలో సింగరేణిలో పనిచేసే ఈ మూడు విభాగాల సిబ్బంది విధులు సైతం కీలకమే కానున్నాయి. విధులకు తరలివెళ్లే రెస్క్యూటీమ్ 20మంది గద్దెల ప్రాంగణంలో విధులు ఉండనున్నారు. ఇక్కడ భక్తులకుఎదరయ్యే సమస్యలపై వీరు సత్వరమే స్పందించనున్నారు.

ప్రధానంగా ఏదైన అనుకొని ప్రమాదం జరిగితే ఫస్ట్ ఎయిడ్ చేయడం, సీపీఆర్ చేయడం, త్వరితగతిన వైద్య సదుపాయం అందించేలా చూడటం వంటివి చేస్తారు. అలాగే, 16 మంది స్విమ్మర్స్ జంపన్న వాగులో ఉంటూ ప్రమాదమేమైనా చోటు చేసుకుంటే వెంటనే స్పందించనున్నారు. నిరంతరాయంగా ఈ స్విమ్మర్స్ విధులు ఉండనున్నాయి. ఇక స్కౌట్స్ సిబ్బంది జంపన్నవాగు సమీపంలోనే అందుబాటులో ఉంటూ తలనీలాలు సమర్పించే వారు నీళ్లలో వాటిని వేయకుండా, క్యూలైన్లో వేచి చూసేవారికి వాటర్ బాటిళు అందించడం, పరిసరాలను ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్మికులచే శుభ్రం చేయించే ప్రధాన విధులు వీరంతా నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు.

## భారత రాయబార కుటుంబాలపై కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 21: ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఆందోళనకర పరిస్థితులు ఉన్న సంగతి తెలిసిందే. అందులోనూ ఇండియాపై అక్కడివాళ్లు ద్వేషంతో రగిలిపోతున్నారు. మరోవైపు హిందువులపై తీవ్రమైన దాడులు జరుగుతున్నాయి. హిందువుల్ని చంపడం, దాడి చేయడం, వారి ఆస్తుల్ని ధ్వంసం చేయడం వంటి ఘటనలు బంగ్లాదేశ్ లో నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ఈ పరిస్తితుల్లో ఇప్పటికే ఇరు దేశాల సంబంధాలు క్షీణించినట్లు కనిపిస్తోంది.

అక్కడ ఉన్న హిందువులతోపాటు భారతీయ అధికారులకు కూడా రక్షణ లేదనే నిర్ణయానికి ఇండియా వచ్చేసింది. అందుకే వారి భద్రత విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. బంగ్లాదేశ్ లో ఉన్న రాయబార కార్యాలయ సిబ్బంది కుటుంబాల్ని తిరిగి ఇండియాకు వచ్చేయాలని ఆదేశించింది. బంగ్లాలోని భారత రాయబారి, ఇతర సిబ్బంది, వేరే విభాగాల్లో పని చేస్తున్న భారత సిబ్బంది కుటుంబ సభ్యుల్ని ఇండియాకు రావాలని భారత విదేశీ వ్యవహారాల శాఖ ఆదేశించినట్లు ఆ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. బంగ్లాలో నెలకొన్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో, ముందు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

అయితే, ఈ నిర్ణయం సిబ్బంది కుటుంబ సభ్యులకు మాత్రమే అని.. సిబ్బంది మాత్రం అక్కడ పని చేస్తారని ఆయన తెలిపారు. భారతీయ రాయబార కార్యాలయం ఎప్పట్లాగే పని చేస్తుందని, ఇతర సేవలు కూడా కొనసాగుతాయని తెలిపారు. అయితే, ఎంతకాలంలోపు కుటుంబ సభ్యులు ఇండియా తిరిగి రావాలి అనే కాలపరిమితి విషయంలో ఇంకా క్లారిటీ లేదు. ప్రస్తుతం బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ప్రధాన రాయబార కార్యాలయం ఉండగా, ఛట్టోగ్రామ్, ఖుల్నా, రజ్షాహి, సిల్హెట్ లలో రాయబార కార్యాలయాలున్నాయి.

## భారీగా పెరుగుతోన్న బంగారం ధర

హైదరాబాద్, జనవరి 21: బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ రోజు బుధవారం (21-01-2026) ఉదయం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర భారతదేశంలో రూ.1, 54,800 ఉంటే, మధ్యాహ్నం గం. 3 ప్రాంతానికి 1,57,260కి చేరింది. ఇది.. నిన్న(మంగళవారం) రూ.1,49,780 ఉంది. అంటే నిన్నటితో పోలిస్తే ఇవాళ్టి మధ్యాహ్నానికి 24 క్యారెట్ల బంగారం ధర దాదాపు రూ.7,480 పెరిగింది.

ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర బుధవారం (21-01-2026) ఉదయం రూ.1,41,900 గా ఉంటే, మధ్యాహ్నం గం.3 ప్రాంతానికి రూ.1,44,150 కు పెరిగింది. నిన్న(మంగళవారం) 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,37,300 ఉంది. అంటే నిన్నటితో పోలిస్తే, ఇవాళ మధ్యాహ్నానికి రూ. 6,850 పెరిగింది. బంగారాన్ని సురక్షిత మైన ఆస్తిగా భావించడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ పెరగడం, అమెరికా-యూరప్ మధ్య వాణిజ్య యుద్ధ భయాలు, డాలర్ బలహీనత, ద్రవ్యోల్బణ ఆందోళనలు వంటి అంతర్జాతీయ కారణాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. దీంతో పాటు దేశీయ మార్కెట్లో వివాహాల సీజన్, ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కూడా ధరలను మరింత పైకి నెట్టాయి.

## ముషీరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, జనవరి 21: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను ప్రజలు ఎక్కడిక్కడ అడ్డుకుంటున్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని మంత్రులు, ఎమ్మెల్యేలను నిలదీస్తున్నారు. తాజాగా జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎస్సీ సీట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను దళిత ఐక్యవేదిక నేతలు అడ్డుకున్నారు.

ముషీరాబాద్ దోమలగూడ సర్కిల్ కార్యాలయం ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రిని అడ్డగించి ఎస్సీల సీట్లు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు.

## ప్రేమజంటను కారులో తీసుకెళ్లిన దుండగులు.. తీవ్రంగా గాయపడ్డ యువకుడు

మెదక్, జనవరి 21: నర్సాపూర్ మండలం చాకరిమెట్ల అటవీ ప్రాంతంలో దారుణ సంఘటన జరిగింది. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం సూరయికుంట తండాకు చెందిన దేవీసింగ్ అనే యువకుడిపై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు విచక్షణా రహితంగా దాడి చేశారు. యువకుడిపై దాడికి ప్రేమ వ్యవహారమే కారణంగా తెలుస్తోంది. సంగారెడ్డి జిల్లా కంది మండలం బ్యాతోల్ గ్రామానికి చెందిన ఓ యువతితో దేవీసింగ్‌కు ప్రేమ వ్యవహారం ఉంది. నర్సాపూర్ బస్టాండ్ వద్ద ప్రేమజంట ఉన్న సమయంలో కొందరు దుండగులు అక్కడకు వచ్చి.. అమ్మాయితో పాటు యువకుడినీ కారులో బలవంతంగా తీసుకెళ్లారు. ఆపై.. చాకరిమెట్ల అటవి ప్రాంతంలో యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. దుండగుల దాడిలో దేవీసింగ్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై యువకుడి కుటుంబ సభ్యులు నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. యువకుడిపై దాడి జరిగిన స్థలాన్ని పరిశీలించారు పోలీసు లు. అయితే యువకుడిపై దాడికి పాల్పడింది ఎవరు ప్రేమ వ్యవహారమే కారణమా. లేక ఇంకేదైనా ఉందా. అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ కేసును త్వరలోనే ఛేదించి నిందితులను పట్టుకుంటామని పోలీసులు చెప్పారు.

## రథ సప్తమిని విజయవంతం చేయాలి : టీటీడీ ఈవో



తిరుపతి, జనవరి 21:శ్రీవారి బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశిని విజయవంతం చేసిన స్ఫూర్తితో జనవరి 25న జరగనున్న రథ సప్తమి ని అత్యంత వైభవంగా నిర్వహించాలని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవన్ లో బుధవారం టీటీడీ అదనపు ఈవో, జిల్లా , టీటీడీ అధికారులతో శాఖల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా , పోలీసు, టీటీడీ అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయడం వల్లే శ్రీవారి బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ద్వార దర్శనాలు విజయవంతం చేశామన్నారు. తద్వారా భక్తులు సంతృప్తి పడేలా సౌకర్యవంతమైన దర్శనం, మెరుగైన సదుపాయాలు కల్పించామని వివరించారు.

రథ సప్తమి రోజున శ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధులు, క్యూలైన్లు, బయట ప్రాంతాల్లో నిరంతరాయంగా భక్తులకు అన్న ప్రసాదాలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భద్రతకు పెద్ద పీట వేయాలని, టీటీడీ భద్రత విభాగం, జిల్లా పోలీసు యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా అదనంగా 5 లక్షల లడ్డూలను బఫర్ స్టాక్ గా నిల్వ ఉంచుకోవాలన్నారు.

భక్తులను ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, ప్రతి వాహనం ముందు వాహన ప్రాముఖ్యతను తెలియజేసేలా వ్యాఖ్యాతలను నియమించాలని హిందూ ధర్మ ప్రచార పరిషత్ అధికారులను ఆదేశించారు.

**చురక**

నైనీ బ్లాక్ బొగుదీయ
నడిచిన టెండర్ల దందా
సింగరేణి ఇమేజీని
చంపి పెట్టజూసె బొంద
పాత్రుదారులెవరైనా
ప్రభుత్వం పరువు తరిగె
అవినీతి ఆరోపణ్ల
ఆయుధాల దాడి పెరిగె



-వేల్పుల నారాయణ
9440433475

## 'ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రాణాలకు భద్రత'

### -హెల్మెట్, సీటు బెల్ట్ తప్పనిసరి
### -వాహనదారులకు బీబీనగర్ సీఐ ప్రభాకర్‌రెడ్డి అవగాహన

నల్గొండ, జనవరి 21:రోడ్డు ప్రమాదాల వల్ల అమూల్యమైన ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని బీబీనగర్ సీఐ ప్రభాకర్ రెడ్డి సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా హైదరాబా ద్-వరంగల్ టోల్ ప్లాజా సిబ్బంది, బీబీనగర్ పోలీసుల ఆధ్వర్యంలో వాహనదారులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ వినియోగించాలని సూచించారు. అతివేగంతో వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, మొబైల్ ఫోన్ ఉపయోగించడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే రోడ్డుపై ప్రమాదానికి గురైన వారిని చూస్తే రోడ్డుపై అలాగే వదిలేయకుండా వెంటనే సమీప దవాఖానకు తరలించి చికిత్స అందేలా చూడాలని, ఆ సమాచారాన్ని వెంటనే పోలీసు లకు తెలియజేయాలని సూచించారు. గాయపడిన వారిని 'గోల్డెన్ అవర్'లో అంటే గంటలోపే దవాఖానకు చేర్చితే ప్రాణాలు కాపాడవచ్చని ఆయన తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రమాదాలే కాకుండా చట్టపర మైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు తన కుటుంబం, తన భవిష్యత్‌ను దృష్టి లో పెట్టుకుని భాధ్యతా యుతంగా వాహనాలు నడపాలని పిలుపునిచ్చారు.

**రాధశ్రీ రాగాలు**

కన్ను తెరిచిన బ్రతుకు
కన్ను మూసిన చితుకు
మధ్య గతుకును మెతుకు
నను రాధశ్రీ !!
తరగి పోయెను పత్తి
పెరిగి పోయెను మిత్తి
నాల్క సాచెను మిత్తి
అనును రాధశ్రీ!!



-రాధశ్రీ
సెల్:9494481210


సాధన సాహితీ స్రవంతి
మరియు
నందనవనం సాహితీ సమితి
సంయుక్త ఆధ్వర్యంలో



ప్రముఖ ఆర్థికవేత్త & సాహితీవేత్త
డా. కర్నాటి లింగయ్య గారి
సాహిత్య స్వర్ణోత్సవ సందర్భంగా వారి
నా జీవన యాత్ర (ఓ క్రియాశీలి ఆత్మకథ)
గ్రంథావిష్కరణ

ముఖ్య అతిథి, గ్రంథావిష్కర్త : డా. కె.వి. రమణాచారి గారు, ఐఏఎస్(రి) తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారులు
అధ్యక్షులు : శ్రీ బైసా దేవదాసు గారు 'నేటి నిజం' పత్రిక సంపాదకులు
సభా ప్రారంభం : డా. ఏనుగు నరసింహారెడ్డి గారు తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సంచాలకులు
విశిష్ట అతిథులు : ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారు పూర్వ తెలుగుశాఖాధిపతి, ఉస్మానియా విశ్వవిద్యాలయం
ఆచార్య మసన చెన్నప్ప గారు పూర్వ తెలుగుశాఖాధిపతి, ఉస్మానియా విశ్వవిద్యాలయం
ఆత్మీయ అతిథి : డా. టి. గౌరీశంకర్ గారు విశ్రాంత రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయం
గ్రంథ సమీక్ష : డా. రాధశ్రీ గారు విశ్రాంత ఏజీఎం, సిండికేట్ బ్యాంక్

తేది: 25-01-2026 ఆదివారం ఉదయం 10 గంటలకు
వేదిక : డా. కె.వి. రమణాచారి, ఐఏఎస్(రి) వారి క్యాంప్ ఆఫీస్, నఫీస్ రెసిడెన్సీ, శాంతినగర్ మెయిన్ రోడ్, మహావీర్ హాస్పిటల్ ఎదురు వీధి, మాసబ్ ట్యాంక్, హైదరాబాదు

సాహితీ మిత్రులకు ఇదే మా సాదర ఆహ్వానం

కర్నాటి ప్రసాద్ ప్రధాన కార్యదర్శి, నందనవనం సాహితీ సమితి
సాధన నరసింహాచార్య అధ్యక్షులు, సాధన సాహితీ స్రవంతి

## సప్త పదులు

మనం
దానం

వృక్ష
పాధాన్యత గుర్తించి
పెంచుకోవాలి
వనం

-కే.వి. వి. సత్య ప్రసాద్
7396301014

గుడి
మడి

నిన్ను తీర్చిదిద్దిన
దేవాలయం
చదువుకున్న
బడి..

-సంధ్య జంగాల
కంకిపాడు

వ్యర్థము
పదార్థము

మనుషుల్లో
నిస్వార్థము తగ్గి
పెరిగింది
స్వార్థము

-వనజాక్షి
హైదరాబాద్


నేటి నిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 22-1-2026


## సప్త పదులు

జనం
మనం

బతుకు బండి
నడవాలంటే
ఉండాలి
ఇం 'ధనం '

-ఆచార్య గిడ్డి వెంకటరమణ
9440984416

ఉప్పు
ముప్పు

తెలుసుకొని
తగ్గించుని వాడితే
నీకే
మెప్పు

-టి.విమాణిక్య లక్ష్మి
హైదరాబాద్

తెలుసుకోవాలి
నడుచుకోవాలి

ఎప్పుడు,
ఎవరితో,
ఎలా ఉండాలో
నేర్చుకోవాలి

-సరోజ రెబ్బాప్రగడ
9663306023

# భాషల మధ్య వాహికగా ఆకాశవాణి సర్వభాషా కవిసమ్మేళనాలు

-సుద్దాల అశోక్ తేజ

భాషల మధ్య వాహికగా గత ఏడు దశాబ్దాలుగా ఆకాశవాణి సర్వభాషా కవిసమ్మేళనాలను నిర్వహిస్తోందని ప్రముఖ సినీగీత రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం ఏటా నిర్వహించే జాతీయ సర్వభాషా కవి సమ్మేళనం సోమవారం హైదరాబాదులో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. ఆకాశవాణి సర్వభాషా కవిసమ్మేళనం అందజేస్తోన్న స్ఫూర్తి భాషల మధ్య సమైక్య వాతావరణానికి దారి తీస్తుందని ఆయన పేర్కొన్నారు. సాహిత్యానువాదం వల్ల ఒక భాషలోని సంస్కృతి, ఆచార వ్యవహారాలు మరో భాషా వ్యవహర్తలకు తెలిసే అవకాశం ఏర్పడుతుందని ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. జాతీయ సమైక్యత, సృజనాత్మకతలను ఇనుమడింపజేసేలా ఆకాశవాణి జాతీయ సర్వభాషా కవి సమ్మేళనాలను నిర్వహిస్తోందని ఆయన పేర్కొన్నారు. సృజనాత్మక అనువాదం కత్తి మీద సాము అని వివరించారు. అనువాదంలో ఏర్పడే చిక్కులను ఆయన సోదాహరణంగా ప్రస్తావించారు. బహు భాషలు, బహుళ సంస్కృతులు పరిఢవిల్లే దేశ ఔన్నత్యాన్ని ఆకాశవాణి సర్వభాషా కవి సమ్మేళనం చాటి చెప్తోందని ఆచార్య నిత్యానందరావు అభిప్రాయపడ్డారు. ఆకాశవాణి 1956 నుండి ప్రతి ఏటా ఈ జాతీయ సర్వభాషా కవి సమ్మేళనాలను నిర్వహిస్తోందని ఈ సందర్భంగా ప్రసంగించిన ఆకాశవాణి క్లస్టర్ హెడ్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ బి. హరిసింగ్ అన్నారు. ప్రతి ఏటా రిపబ్లిక్ దినోత్సవ సందర్భంగా నిర్వహిస్తోన్న సర్వభాషా కవిసమ్మేళనం 22 భారతీయ భాషల మధ్య అనుసంధానం కలిగిస్తోందని ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం కార్యక్రమ విభాగాధిపతి సుంకసారి రమేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈ ఏడాది జాతీయ తెలుగు కవిగా ఎంపిక చేసిన సుప్రసిద్ధ కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు డా. నందిని సిధారెడ్డి తన కవిత 'మెర్సీ వాల్' ను వినిపించారు. ఇప్పటికే ఢిల్లీ వేదికగా జరిగిన జాతీయ కవిసమ్మేళనంలో ఆయన తన కవితను చదివి వినిపించడం విశేషం. ఈ కవితను 22 భారతీయ భాషల్లోకి అనువదించగా, దేశంలోని అన్ని ఆకాశవాణి కేంద్రాలు ఈ కవిత అనువాదాలను ప్రసారం చేస్తాయి.



జాతీయ తెలుగు కవిగా ఎంపిక చేసిన సుప్రసిద్ధ కవి, తెలంగాణ పూర్వ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా॥నందిని సిధారెడ్డిని సత్కరిస్తున్న అతిథులు



స్పందన తెలియజేస్తున్న డా॥నందిని సిధారెడ్డి. సభను ప్రారంభిస్తున్న వైస్ ఛాన్సలర్ ఆచార్య నిత్యానందరావు.






కవి సమ్మేళనంలో పాల్గొన్న అతిథులు, కవులు.

కాగా అన్ని భారతీయ భాషల నుండి ఎంపిక చేసిన కవితలను ప్రముఖ తెలుగు కవులు తెలుగులోకి అనువదించారు. డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు, డా. ఏనుగు నరసింహారెడ్డి, డా.మామిడి హరికృష్ణ, దేశపతి శ్రీనివాస్, సుధామ, దర్భశయనం శ్రీనివాసాచార్య, డా. జుర్రు చెన్నయ్య, అయినంపూడి శ్రీలక్ష్మి, డా. నమ్మెట నాగమల్లేశ్వరరావు, తాడేపల్లి పతంజలి, పుట్టపర్తి నాగపద్మిని, యార్లగడ్డ రాఘవేంద్ర రావు, మందలపర్తి కిశోర్, డా. పసునూరి రవీందర్, నస్రీన్ ఖాన్, మెర్సీ మార్గరెట్, అన్వర్, షేక్ సలీమా, చైతన్య పింగళి, దేశరాజు, నెల్లుట్ల రమాదేవి, తిరునగరి శ్రీనివాస్ వివిధ భారతీయ భాషల నుండి ఎంపిక చేసిన కవితలను తెలుగులోకి తర్జుమా చేశారు. ఈ కవులను ఆకాశవాణి ఘనంగా సత్కరించింది. ఈ అనువాద కవితలను ఆకాశవాణి ఈ నెల 25 వ తేదీ రాత్రి ప్రసారం చేస్తుంది.

ఈ కార్యక్రమంలో ఆకాశవాణి అధికారులు నిహార కానేటి, కార్యవర్ధి, సందీప్, నీలిమ, లహరి, సాంబశివరావు, భిక్షా తదితరులు పాల్గొన్నారు. ఆకాశవాణి వ్యాఖ్యాతలు దక్షిణా మూర్తి, శ్రీవాణి వ్యాఖ్యాన పటిమతో ఆకాశవాణి జాతీయ సర్వభాషా కవి సమ్మేళనం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. తెలుగు భాష నుండి ఇప్పటివరకు ఎంపికైన జాతీయ తెలుగు కవుల వివరాలతో కూడిన వీడియో, ఆయా సుప్రసిద్ధ కవుల చేతి రాతతో కూడిన డాక్యుమెంటరీ ఆహూతులను ఆకర్షించాయి.



# విభిన్న భావాల సమాహారం...!

- దాస్యం సేనాధిపతి
సెల్:94405 25544



పుస్తక సమీక్ష

**పద కదలి వెల్లువలో నేనో బిందువును**
**పదం కలిపి నడుస్తున్న బంధువును..**

అంటూ వినమ్రంగా విన్నివించుకునే కవయిత్రి విశ్వైక తమ మొదటి కవితా సంపుటిని **"తొలి సంతకం"** పేరుతో వెలువరించి గ్రంథకర్తగా సాహితీ రంగంలోకి అడుగుడినారు. వృత్తిరీత్యా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో న్యూస్ రీడర్ అయిన ఆమె ప్రవృత్తి రిత్యా కవన రంగాన్ని ఎంపిక చేసుకున్నారు. స్టేజ్ యాంకర్‌గా పలు సాహిత్య సమావేశా లకు వ్యాఖ్యానం చేసిన అనుభవం ఆమెకు ఉంది. వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్‌గా సినీ గేయ రచయిత్రిగా వనిత, భక్తి టీవీ కార్యక్రమాలలో పాల్గొన్న వ్యాఖ్యాతగా, అందరి మన్ననలు అందుకున్న విశ్వైక **"అక్షరయాన్"** మహిళా రచయిత్రుల సంస్థకు ప్రధాన కార్యదర్శిగా ఎన్నో సాహిత్య కార్యక్ర మాలను నిర్వహించడం విశేషం. "తొలి సంతకం" గ్రంథంలోని కవితలన్నీ సామాజిక అంశాలను మోసుకొచ్చాయి. వస్తు ఎంపికలో వైవి ధ్యాన్ని పాటిస్తూ.. కొంతమేరకు అభివ్యక్తిలో నవ్యతకు చోటు కల్పించారు.

**ముగింపు లేక సాగాలి మనం**
**మనుముందుకు చేరాలి మనం..**

**గమ్యం దిశగా అడుగులు వేయాలని** ఆకాంక్షించే విశ్వైక **ముళ్ళ వలయం దాటి తేనే.. గులాబీ అందుతుందని, పంకంలో దిగితేనే కమలం అందుతుందన్న** విశ్వాసం ఉండటం విశేషం.. జీవ జాతుల రక్షణ జాబితాలో ఆడజాతి చేరక ముందే కళ్లు తెరిచి చూడండని కాబోయే అమ్మను కాపాడండని హితవు పలికారు. లౌక్యం ఉంటేనే మనిషికి సౌఖ్యం అని భావించే విశ్వైక **కలుపుగోలుతనం చిగురించాలని.. అవే అనురాగ పరిమళా లను వెదజల్లుతాయని** ఓ కవితలో వివరించారు.

**"రైతు-మట్టి"** కవితలో ధర్మానికి మరోపేరు రైతు. **ప్రగతి వృక్ష పటిష్ట వేరు చెట్టు.. జాతి అభ్యున్నతికి మూలధనం రైతు** అని విడమరిచి చెప్పారు. **"ఛిద్రమైన ఆశలు"** కవితలో కవయిత్రి విశ్వైక ప్రకటించిన భావాలు ఆర్ధ్రంగా కొలువుదీరాయి. **ఎదిగే క్రమంలో జరిగే ఎగ్రపూల మార్పులతో బెంబేలెత్తిపోతుంటే భయాన్ని మాపే భరోసా కోసం ఆశగా వెతికా, అనుక్షణం జీవితంలో అవమానాల అలల ఒడిదుడుకులలో ఆత్మీ యత అందించే అమ్మ మనసుకై వెదికా నంటూ** కవితను కొనసాగించిన తీరు బాగుంది. **"నా బాల్యం"** కవితలో కవయిత్రి తమ బాల్య స్మృతులను అక్షరాల్లో బంధించారు. నా బాల్యం- అందమైన జ్ఞాపకాల మణిహారం.. అంతులేని అనుభూతుల సమాహారమని వివరించారు. నాన్న వీపుపై ఊరేగిన ఉప్పుమూట- బడి పలుకులు నేర్పిన బావి ఊటను గుర్తుకు తెచ్చుకున్నారు.





ప్రతులకు: విశ్వైక
9550183143



**"వెలుగుల దివిటి"** కవితలో వృద్ధాప్యాన్ని విభిన్న కోణాల్లో ఆవిష్కరించారు. వృద్ధాప్యం.. ఊహ తెలిసిన పసితనం.. సత్తువ లేని బేలతనం.. **వృద్ధాప్యం అనివార్యపు మజిలీకి చివరి వీధి, అనుభవాల మణులు నిండిన గుప్తనిధి** అని విశ్లేషించారు.

**"నిశీధి ప్రభాతాలు"** కవితలో కవయిత్రి విశ్వైక తమ భావుకతను ప్రదర్శించారు. అవిగో అవిగో నా స్వప్నాలు.. **కునుకు జోలలో తడిచే/ మంచు ముత్యపు కణికలు/ కమ్మని ఊసులు పలికించే/ కంచికి చేరని తరం గిణులు** అంటూ కవితను ఎత్తుకున్న తీరు బాగుంది. ఇంకా ఈ కవితలో **అనంత దృశ్య మాతృకల/ అదృశ్య లోక చిత్రికలను/ మది పొరల మధ్య కదలాడే భావావేశ రూపాలను, హృది అలజడులను పోతపోసే దర్పణాలను, మూసివున్న రెప్పల మాటు/ మరో లోకపు విహారాలను అందంగా** ఆవిష్కరించారు. **కమ్మని లాలింపుల కనికట్టు తాయిలాలను, కఠోర గాలిం పుల/ బెదిరింపు సంకేతాలను** తరతమ భేదాలు లేని నిశీధి ప్రభాతాలను కవితాత్మకంగా అక్షరాల్లో నిక్షిప్తం చేశారు. **"జలపాతం"** కవితలోనూ కవయిత్రి చక్కని భావ ప్రకటన చేశారు. **హరివిల్లు రంగుల్ని మమేకం చేసుకున్న శ్వేతాంశ తోజోయామిని/ నిరంతర నిర్మల గామిని** అంటూ ప్రారంభించారు. **పర్వత గిరుల నడుమ సాగే వెన్నెల వారుణీ ఝురి, ఉరకలేసే ఉత్తుంగ తరంగ లహరి..** అంటూ జలపాతం నడకను దృశ్యమానం చేసిన తీరు బాగుంది. **ఔషధీ సారాల యుక్తమైన/ అద్భుత ప్రవాహమా/ మనో నవమ్మోహన వసంతమా..** అంటూ కొనసాగించారు. **నవనీత సోయగాల నురగలు దాల్చి/ శీతల వాయు వింజామరలు వీచి/ నీటి తుంపరల చిలకరింపుల నాన్చి/ మేనియందు పులకరింతలు దేల్చి/ పరివాహక ప్రాంతాలకు/ పచ్చదనమద్దే పయోనిధీ/ రజత వర్ణ జలవారధి** అంటూ జలపాతాన్ని కవితాత్మకంగా.. అపురూపంగా, అందంగా దృశ్యమానం చేశారు. కరోనా కాలం నాటి ఘటనలను, సంఘటనలను, చేదు అనుభవాలను.. **"వసుధైక పోరాటం"** కవిత లో కవయిత్రి విశ్వైక చక్కగా ఆవిష్కరించారు. **ప్రపంచానికి సుస్తీ చేసింది.. గుండెలర చేతితో పట్టుకుని గస్తీ కాస్తోంది. అవును మరి.. సృష్టి సమజమైన స్వేచ్ఛా జీవుల సహజ జీవనాన్ని చెరబట్టి కనికరం వీడి కర్కశంగా కాటు వేస్తుంటే.. కన్నెరజేసిన ప్రకృతి కరాళ నృత్యం చేసిందని** వ్యాఖ్యానించారు.

**కరోనా రక్కసిని పారదోల ప్రపంచమంతా ఒక్కటైందనీ.. తమ జాతి ఉనికి కాపడుకునేం దుకు/ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు పాదాక్రాంతమైందనీ.. కరచాలన కంపనాలు విడిచి నమస్కార సంస్కారాన్ని నేర్చుకుందని** పేర్కొన్నారు. **ఆహారపు అలవాట్లను మార్చు కుని, ఆచారాల ఆనవాళ్లు గుర్తించిందని శుచి, శుభ్రతల భద్రాతా పరదాల కింద ఆనాడు సావధానంగా సేద దీరిన విషయాలను** ఈ కవితలో విశదీకరించారు. శ్రీ శోభకృత నామ సంవత్సరం సందర్భంగా భక్తి టీవీలో **"ఉగాది వసంతం"** కోసం **"ఉగాది ప్రతి"** కవితను రాశారు. **వసంతమా.. తరుల విరుల సుగంధమా.. వసంతమా.. ధరణీ లలామ ఆనంద ప్రకాశమా!** అంటూ ప్రారంభించారు. **నీవస్తున్నావన్న సంతసాన/ బంతిపూల మెడలు తెంపి/ బారెడు మూరెడు మాలలు అల్లి గుమ్మానికి సింగారించాను.. మామిడాకుల తొడిమలు త్రుంచి.. ముఖ ద్వారానికి తోరణాలుగా అద్దాను** అంటూ కొనసాగించారు.

**ఆరు రుచుల నైవేద్యాన్ని స్వీకరించి ప్రకృతి సంపదను అధికం చేసేందుకు.. ప్రతి ఒక్కరం ప్రతిన పూనుదామని** పిలుపునిస్తూ కవితను ముగించారు. **కార్మిక లోకం వెట్టి చాకిరికి చరమ గీతం పాడి.. ప్రతి ఏటా జరుపుకుంటున్న మేడేను** ఓ కవితలో చక్కగా ప్రస్తావించారు. ప్రస్తుతించారు. ప్రపంచ శ్రామికులంతా ఏకమై స్వతంత్ర గీతం ఆలపించారు. **ఆ రోజు చమట చుక్కలు చరిత్రలో చెర గని సిరా చుక్కలైనాయని** ప్రశంసిం చారు. శ్రమైక జీవన సౌందర్యానికి అక్షర హారతిపట్టారు. **గమ్యం లేని ఆశల దారులలో/ గాబరాగా తిరుగుతూ/ ఊహల మేఘాలలో ఊరేగుతుంటాం** అంటూ **"గొప్పలు'** కవితలో కవయిత్రి విశ్వైక ప్రకటించిన భావాలు బాగున్నాయి. **అశాశ్వతమైన/ అందాలను/ తూనిక రాళ్ళతో/ బేరీజు వేసుకుని/ విర్రవీగుతుంటాయనీ/ కీర్తి కిరీటాల కోరలలో చిక్కుకుని/ పేరు ప్రఖ్యాతుల కొలత లేసుకుంటూ కులుకుతుంటామని/ లేనిపోని డాంబికాలతో/ త్రిశంకు స్వర్గంలో గొప్పలు చూపుతూ/ బతికేస్తుంటామని** వాస్తవాలకు అద్దం పట్టారు. **"క్షమతత్వం"** కవితలో **గృహిణి యొక్క ఔన్నత్యాన్ని- ఉత్తమ వ్యక్తిత్వాన్ని.. క్షమాగుణాన్ని** ఆవిష్కరించారు.

**ఆమె.. అంతే!! కన్నీటి రెప్పమాటున/ కష్టాన్ని పంటి బిగువున భరిస్తూ/ కుటుంబ బంధాల మాలను/ అల్లుతుంటుంది/ ఎప్పటికప్పుడు క్షమాపణల పన్నీటిని/ చల్లుతుంటుందని/ సుగంధాల ప్రేమను పంచుతుందంటూ** గృహిణి యొక్క క్షమా గుణాన్ని అక్షరీకరిం చారు. **"కన్నీరు"** కవితలో "కన్నీరు'ను విభిన్న కోణాల్లో ఆవిష్కరించారు.

**ఆవేదనల అగ్ని పర్వతం బద్దలైనప్పుడు/ కంటి కొలను నుండి/ విరుచుకుపడి ఎగసే/ లావాయే కన్నీరని తేల్చి చెప్పారు.ప పుట్టుకతో తోడుండే తొలినేస్తం/ కడసారి వీడ్కోలు స్మృతి చిహ్నం/ సాటిలేని బాంధవ్యానికి మేటి నిదర్శనమైన** ఆ జన్మ బంధువుగా "కన్నీరు'ను అభివర్ణించారు.

ఓ కవితలో.. **కుర్చీకి పెద్దన్న.. మంచానికి చిన్నన్న మధ్యనున్న మమకారపు లాలిం పు 'వాలుకుర్చీ'** అంటూ చమత్కరించారు.

**"రావా ప్రియా"** కవితలో కవయిత్రి విశ్వైక భావ కవిత్వానికి చోటు కల్పించారు. **నీ సరాగాల జడివానలో/ ఉక్కిరి బిక్కిరై/ నేను అలసిపోతుంటే.. పారిజాత పరిమళాలు జాలి ఒలక బోస్తూ.. అల్లరిగా నవ్వుతున్నాయి ఎక్కడున్నావు ప్రియా?** అని ప్రశ్నించారు.

ఇలా ఎన్నో కవితా పంక్తులు ఈ గ్రంథలో ఉదహరించడానికి యోగ్యంగా ఉన్నాయి.

విభిన్న భావాల సమాహారంగా రూపుదిద్దు కు న్న ఈ పుస్తకాన్ని విశ్వైక తమ తల్లిదండ్రులకు అంకిత మిచ్చారు. మాతృభాష తెలుగు పట్ల మక్కువ చూపే విశ్వైకకు కళలు, ఆటలు, పాటలు, డాన్సులు, డ్రాయింగ్, పేయింట్ వంటి అంశాల్లోనూ అభిరుచి ఉండటం అభినందనీయం. ఇంటర్లో ఉన్నప్పుడే ఆమె సామాజిక కవితను రాసి.. ఆమె నాన్నగారి ప్రశంసలందు కోవడం విశేషం. కార్తీక్ విశ్వగీసిన ముఖచిత్రం గ్రంథానికి నిండు శోభను కూర్చింది. కవిత్వ సృజనలో ఆమె మరిన్ని మెలకువలు తెలుసుకోవాల్సి ఉంది.

వస్తు ఎంపికలో మరింత వైవిధ్యాన్ని చూపాలి.. అభివ్యక్తిలో గాఢతకు చోటు కల్పించాల్సి ఉంది.

కవితా పంక్తుల్లో వచనం డామినేట్ చేయకుండా జాగ్రత్త పడాల్సి ఉంది. పదబంధ ప్రయోగంలో ఔచి త్యాన్ని పాటించాలి.

శిల్పం విషయంలో మరింత శ్రద్ధ చూపి చతురతను ప్రదర్శించాలి.

అధ్యయనం ద్వారా కవయిత్రి విశ్వైక తమ కలానికి మరింత పదును పెట్టుకోవాలి.

సామాజిక సమస్యలను.. వర్తమాన ఘటనలను.. సంఘటనలను తమ కవిత్వపు యితివృత్తాలుగా మరింత బాగా మలుచుకుని.. సామాజిక చైతన్యానికి దోహద పడే విధంగా విశ్వైక తమ రచనల్ని మనకు అందిస్తా రన్న విశ్వాసం ఉంది.

ఈ దిశలో అడుగులు వేసా రన్న నమ్మకమూ ఉంది.

## సీటు దొరికిన బస్సు

రోజూ యాభై మైళ్లావలి తీరం
నా గమ్యం
సమయం కన్నా ముందే చేరేందుకు
వ్యూహం.
దూరం నుంచి
నేనెదిరి చూస్తున్న బస్సు
హమ్మయ్య..!
రెక్కల గుర్రం
నాకోసమే ఏతెంచినట్లు..
బస్సు కన్నా ముందే సంబురం
వికసింప చేస్తుంది.
సీటు దొరికింది
నిన్నటి
కవితాక్షరాల ముంగురులను
సవరించాలి
వెంట తెచ్చుకున్న మహాకవిని
చివరికంటా చదివెయ్యాలి
కదిలి పోతున్న కిటికీ లోంచి
పిల్లగాలినై తిరిగి రావాలి
పరుగులు పెడుతున్న తొవ్వ పక్క
అందాలని చేదుకోవాలి.
మా పసిమొగ్గలు
నా రాక కోసం గేటు దగ్గరే
ఎదిరి చూస్తాయి
ప్రార్థన కన్నా ముందే
పలుకరించాలి .!.
లెక్కలేనన్ని అక్కెరలను మోస్తూ
దూసుకు పోతున్న
ఈ రాజహంస
నా కెప్పటికీ
ఆత్మీయ మిత్రుడే..!

-నాంపల్లి సుజాత
9848059893



## జీవధార

అమ్మ కన్న మిన్న లేదు
మాతృభాష కన్న భాష లేదు
మమతల మాధుర్యం తెలిపేది
మంచిని మనసున పెంచేది మాతృభాష
ఆశలకు చేయూత
భావాలకు కల్పతరువు
అందమైన ఆలోచనలకు కాణాచి
అమ్మను మరిచి మమ్మీని చేశారు
మమ్మీకి అర్థం తెలుసుకోండి
అమ్మలోని
లాలనను తెలుసుకోండి
నాన్న అన్న పిలుపు
రక్షణ ధైర్యాన్నిస్తుంది
అత్త మామ అన్న పదాలు
ఆంగ్లంతో కలిసి
ఆంటీ అంకుల్ ఐనాయి
గురువుగారు
అనే గౌరవ వాచకం
గురూగా మారిపోయింది
మాతృభాషలో నిపుణత
సాధించండి
పరభాష
వ్యామోహానికీ బానిసలుకాకండి
జీవనానికి జీతానికి ఆంగ్లం నేర్వండి
ఏదేశానికి వెళ్ళినా మన
సంస్కృతి
సంప్రదాయాలను విడనాడకండి
సాహిత్య సంపదకు అలవాలమైన
జీవధార మాతృభాష
అమ్మ అని పిలవటంలోని
అమృతత్వాన్ని తెలుసుకోండి
పిలిచే పిలుపులో ప్రేమను చూడండి
మాతృభాషను ఆదరించండి మీ
అస్తిత్వాన్నికాపాడుకోండి
పదుగురితోకాక
పదుగురిలో ఒకరుగా
జీవించి గౌరవాన్ని పొందండి
అమ్మభాషను
ఆదరించండి ఆచరించండి.

-డా.మైలవరపు
లలితకుమారి
9959510422



## పాఠ్యాంశాల బ్లాక్ హోల్...!

కాల గుండె పుస్తకంలో క్యాలెండర్ పేజీ మారింది
జ్ఞాపకాల మెసెంజర్ గ్యాలరీ తో
ఓ సంవత్సరం వీడ్కోలు పలికింది..!
నులి వెచ్చని జ్ఞాన కిరణాల వెలుగులో
ఆత్మీయ వేడుకల జలధారలో
స్వాగత మంటోంది క్వాంటం ప్రపంచం..!.
విజయాలు వివాదాలు విప్లవాలు
విషాదాలు వికాసాలు ఇలాంటివెన్నో
అనుభూతుల ఇంద్రధనస్సు కదా జీవితమంటే..!
నీలో నీతో బతుకు యుద్ధం నేర్చుకుంటే
ప్రతి నిమిషం నీకు ఉద్యమమై పాఠం చెప్తుంది
నీ అనుభవమే భవిష్యత్ తరాల అంతరిక్షంలో
పాఠ్యాంశాల బ్లాక్ హోల్ అవుతుంది..! .
పరిణామంలో కొత్త ప్రవాహంతో
పాత ప్రభావం కలిసే ఉంటుంది
నూతన ఉషస్సుతో నిరాశ నిస్పృహల
స్వరాలను తరిమేస్తూ... ఆశావాద ఆక్సిజన్ ను
నీ రక్తనాళాల్లో నింపేస్తూ...
ఆత్మవిశ్వాస ప్రకాశానికి నీ గుండె ఓ దిక్సూచి గెలాక్సీ..!
విశ్వశాంతి సౌధంలో వసుధైక భావనతో
మన హృదయాల ముంగిట్లో
భిన్న సంస్కృతి లోని ఏకత్వాల ముగ్గులతో
పర్యావరణ జాగృతి సందేశ జాబిల్లి తో
హ్యాపీ న్యూ ఇయర్ సందడి చేద్దాం..!

-ఫిజిక్స్ అరుణ్ కుమార్
9394749536



# మేడారం జాతర

సమ్మక్క సారలమ్మ జాతర ములుగు జిల్లా తాడ్వాయి మండలానికి చెందిన మేడారం గ్రామంలో జరిగే గిరిజన జాతర. మేడారం గ్రామం ములుగు జిల్లా నుండి 44 కిలోమీటర్ల దూరం లో ఉంది. ప్రపంచంలోనే అతి పెద్దగా జరిగే గిరిజనుల జాతర.

1996లో తెలంగాణ రాష్ట్ర పండుగగా ప్రభుత్వం నుండి గుర్తింపు పొందింది. కుంభ మేళాను తలపిస్తూ అత్యధికులు హాజరయ్యే పండుగ. గిరిజన సంప్రదాయరీతుల్లో జరుగు తుంది. మన రాష్ట్రం నుండే కాక పొరుగు రాష్ట్రాలైన ఆంధ్ర ప్రదేశ్ ,మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ,ఒరిస్సా రాష్ట్రాలు నుండి లక్షల మంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుం టారు. తాడ్వాయి మండలంలో ఉన్న మారుమూల అటవీ ప్రాం తం మేడారంలో దట్టమైన అడవు లు కొండ కోనలమధ్య ఈ చారిత్ర కమైన జాతర జరుగు తుంది. తెలంగాణ ప్రభుత్వం 2014 రాష్ట్ర పండుగగా గుర్తించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 1996లో రాష్ట్ర పండుగగా గుర్తించింది.

ఆశ్చర్యాద్భుతాలు కలబోసిన మేడారం జాతర. అందమైన కట్టడాలతో శిల్ప సౌందర్యంతో కట్టిన గుడి కాదు. కన్నులకింపు కలిగించే కట్టడాలు లేవు. వైభవో పేతమైన చిత్రవిచిత్రాల నిర్మాణాలు అసలే కానరావు. కొండలు, గుట్టల ఆనవాల్లు లేవు. అక్కడ ఉన్నది కుంకుమ భరణి. దేవతల ప్రతిరూపాలుగా కొలిచే గద్దెలు మాత్రమే. దట్టమైన అటవి ప్రాంతం మారుమూల

కుగ్రామం ఆలయంలేని అ ద్భుతం. విగ్రహం లేని విశ్వాసం. గద్దెలపై గద్దెల మధ్య అమ్మవారి అంశగా రెండు కర్రలు పాతి ఉంటాయి. వాటికి చీరలు చుట్టి అమ్మవారిగా కొలుస్తారు. భక్తులు చీర, సారె,పసుపు కుంకుమలతో ఒడిబియ్యం బంగారం (బెల్లము) అమ్మవార్లకు సమర్పిస్తారు. దీప, ధూపాలు అడగని వనదేవతలు వీరు.

తెలంగాణ ప్రాంతములోని ప్రతి ఇంట్లో సమ్మక్క, సారలమ్మలను ఇలవేల్పులుగా కొలుస్తారు. పుట్టిన పిల్లలకు పుట్టు వెంట్రుకలు కూడా ఇక్కడే తీస్తారు. ఎత్తు బెల్లాలు, ఎదురు కోళ్ళను సమర్పిస్తారు.ఇసుకేస్తే రాలని జనంతో పరిసర ప్రాంతాలన్నీ నిండిపోయి ఉంటాయి. సౌకర్యాలను అడిగే వారు లేరు. ఎవరికి వారే సౌకర్యాలు కల్పించుకొని ఆనందంగా అమ్మవారి మొక్కలు చెల్లించుకునే ఆనందమయ జాతర మేడారం జాతర.

మేడారం జాతర రెండేళ్ల కొకసారి మాఘశుద్ద పౌర్ణమి నుండి నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగు తుంది. ఈ పౌర్ణమిని సమ్మక్క పున్నం అని కూడా అంటారు.

అటవీ ప్రాంతమంతా విద్యుత్ దీపాలతో అన్ని సౌకర్యాలతో ఆ నాలుగు రోజులు నగరంగా మారిపోతుంది. ముఖ్యమంత్రి నుండి బాధ్యతలు గల ప్రతి ఉద్యోగులందరినీ అందుబాటులోకి తెచ్చుకునే అమ్మలజాతర.

ఇంతింతైయ్ వటుడింతై అనే విధంగా మారుమూలలో జరిగే మేడారం జాతర విశ్వవ్యాప్తమై ంది. కులమతాలకు అతీతంగా తండోపతండాలుగా జనం అమ్మ ల సన్నిధికి చేరుకొని మొక్కులు చెల్లించుకుంటారు.

## ప్రపంచ గిరిజన ఉత్సవాలలో అతిపెద్దది మేడారం జాతర.



సమ్మక్క రాచకోయ జాతి దేవత. రాచకోయలు క్రీ.శ : పది, పన్నెండు శతాబ్దాలు గోదావరి పరివాహక ప్రాంతాల్లో రాచరికం చేశారు. ఇప్పటికీ ఛత్తీస్ ఘడ్ ఉత్తర తెలంగాణలో ఈ ఆనవాళ్ళ కనిపిస్తాయి.

పేరంబోయిన రాజు కొడుకు రాయబండాని రాజు.అతని కుమారుడు కార్తీక మహారాజు. ఇతనికి ఇద్దరు భార్యలు కనకంబో యిరాలు ,చందం బోయి రాలు. వీరి పిల్లలు సమ్మక్క, నాగులమ్మ. వీరితో వియ్యమందడానికి పర్ద్ రాజులొచ్చారు. ఆ వంశానికి ఏలిక జలాసంద్రుడు. అతని భార్య మందాళిని .వీరికి ఐదుగురు పిల్లలు పెద్దవాడు పగిడిద్దరాజు రెండోవాడు గోవిందరాజు.

వీరికి సమ్మక్క కావాలని కోర డంతో సమ్మక్క తండ్రి ఒప్పుకున్నాడు. కానీ ఏడు సముద్రాల దాటి ఏడు చెప్పులు జోళ్ళు అరిగే దాక పిల్లనివ్వనన్నాడు. ఆనాడు వరుని కంటే వధువుకే గౌరవం ఎక్కువ అని తెలుస్తుంది. సమ్మక్క చెల్లెలు నాగులమ్మ. అక్క తరపున పెళ్ళికొడుకుని చూసి వస్తానని తల్లిదండ్రులకు చెప్పి పగిడిద్ద రాజు ఊరు చేరింది .అతని నగరాన్ని తిరిగి చూసింది. పెళ్లి ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. గిరిజనల పెళ్ళిలో వాయిద్యాలమోతతో తాగడం, తినడం ఆట,పాట అన్ని ఉండాల్సిందే.

ఒకరోజు సమ్మక్క, నాగులమ్మ కట్టెలు తేవడానికి అడవికి వెళ్లారు. చెల్లెలు తనకు కాబోయే భర్తను చూసి వచ్చింది కనుక అతను ఎలా ఉన్నాడు అని అడిగింది సమ్మక్క. దాంతో నాగులమ్మ ఆయన వీపున రాసగడ్డలు పుట్టాయి. దోనెచెవులు, దొప్పకడుపుంది సొట్ట కండ్ల వాడు. పంగల కాళ్ళవాడు. నీకు ఇష్టమైతే చేసుకోమంటుంది నాగులమ్మ.

ఆ మాటలువిన్న సమ్మక్క మనసు చిన్న పోయింది. అటు వంటి కురూపి తనకు వద్దనుకున్నది. తండ్రికి ఆ మాట చెప్పింది .మాట ఇచ్చి మాట తప్పవద్దని తండ్రి ఎంత సర్ది చెప్పినా సమ్మక్క వినక పోవడంతో తన రెండవ కూతురు నాగులమ్మ నిచ్చి పెళ్లి చేస్తానని పగడిద్ద రాజుకు కబురు పెట్టాడు. పెళ్లి ఆగిపోవడం అపశకునం కనుక నాగులమ్మతో వివాహానికి అంగీకరించాడు పగిడిద్దరాజు. తమ ఇంట్లో తండ్రి పెళ్లికి పందిళ్లు అరుగులు వేయిస్తుంటే, సమ్మక్క చిలక రూపంలో పగిడిద్దరాజు ఇంటికి వచ్చి పెళ్లి పందిరి పై వాలింది. పెళ్లి హడావుడి పెరిగింది. అందంగా ఉన్న పగిడిద్దరాజుని చూసి మనసు పారేసుకున్నది. సమ్మక్క తన చెల్లెలు చేసిన మోసం తెలుసుకుంది. తనకు భర్తగాకాకుండా చేసి తానే అతన్ని పెళ్లి చేసుకోవడం

సమ్మక్కకు కోపం తెప్పించింది. చెల్లెలు పై కోపానికి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న పగిడిద్దరాజు సమ్మక్కని శాంతింప చేసి అక్కా చెల్లెల్లిద్దరిని పెళ్లి చేసుకున్నాడని వీరికి సారలమ్మ ,జంపన్న అనే ఇద్దరు పిల్లలున్నారని ఒక కథనం.

బయ్యక్కపేట మేడారానికి పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉంది.ఇక్కడ రాచకోయ బోయక్క.దుస్స వేరు (నల్ల గడ్డలు) తవ్వుతుండగా పెట్టెలో బిడ్డ కనిపించిందట ఆపాపను ఇంటికి తెచ్చుకొని అల్లారు ముద్దుగా పెంచి పగిడిద్దరాజుకిచ్చి పెళ్ళి చేశారని ఒక కథనం.

మేడారం గ్రామంలోని కోయదొరలు గోదావరి తీరాన దట్టమైన అడవిలో వేటకు వెళ్ళినప్పుడు పెద్దపులుల మధ్య ఆనందంగా చిరునవ్వులొలుకుతున్న ఒక పాప వారికి కనిపించింది .ఆ పాపను కోయదొర తమతోతీసుకెళ్ళి మార్గశిర పౌర్ణమి నాడు ఆమెకు 'సమ్మక్క' అని పేరు పెట్టారు. ఆ పాప వచ్చినప్పుడు నుండి వారికి శుభాలు కలగడం. ఆమె పెరుగుతున్న క్రమంలో దైవ లీల కనిపించడంతో ఆమెను దేవతగా కొలిచేవారు. సంతానం లేని వారికి సంతాన ప్రాప్తి, విషకీటకాలు పాముకాటు గురైన వారిని బ్రతికి ంచడం. రోగులపై ఆమె చేయి పడగానే ఆరోగ్యవంతులవడంతో ఆమెను గిరిజనులందరు దేవతగానే భావించేవారు.

ఆమెకు యుక్త వయసు రాగానే పగిడిద్దరాజుకిచ్చి పెళ్లి చేశారు. ఆ దంపతులకు సారలమ్మ ,నాగులమ్మ, జంపన్న ముగ్గురు సంతానం కలిగారని ఒక కథనం.

మేడారం ప్రాంతాన్ని కోయరాజులు కాకతీయులకు సామంతులుగా ఉండి పరిపాలించేవారు .వరుసగా మూడు ,నాలుగేళ్ల పాటు అనావృష్టి ఏర్పడింది. ప్రజలు పన్నులు కట్టలేని పరిస్థితి ఏర్పడింది. పగడిద్దరాజు కప్పం కట్టుటకు నిరాకరించటంతో కాకతీయ ప్రభువు ప్రతాపరుద్రచక్రవర్తి గిరిజన పాలకులను అణచి వేయడానికి సైనికులను పంపాడు.కాకతీయ సైన్యం లక్నవరం సరస్సు వద్ద స్థావరం ఏర్పర చుకుని యుద్ధం ప్రకటించారు .పగిడిద్ద రాజు కాకతీయ సైన్యాన్ని మేడారం సరిహద్దుల్లోని సంపెంగ వాగు వద్ద నిలువరించి వీరోచితంగా పోరాడాడు. పగిడిద్ద రాజు కుటుంబమంతా వీరమరణం పొందారు. ఓటమిని భరించ లేని జంపన్న సంపంగి వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుండి ఆ వాగు జంపన్న వాగుగా ప్రసిద్ధిగాంచింది.



తన వాళ్ల మరణిం చారన్న వార్త విన్న సమ్మక్క యుద్ధరంగంలో అపరకా ళికలా విజృంభించి కాకతీ య సైన్యాన్ని చెల్లా చెదురు చేస్తూ పరిగెత్తించి సైనికుల ను అంతం చేసింది. ఓటమి తప్పదని భావించిన కాకతీ య సైనికుడు దొంగచా టుగా సమ్మక్కను బల్లెంతో వెనుక నుండి పొడవడంతో రక్తమోడుతూ గుర్రంపై వాలి మేడారం గ్రామానికి ఈశాన్యంలో ఉన్న చిలుకల గుట్టకు చేరి అదృశ్యమైంది. ఆమె వెనకనే పరిగెత్తుతున్న కోయలకు ఎంత వెతికిన ఆమె జాడకనపడలేదు.కాని, అక్కడే ఉన్న నమిలి నార చెట్టు కింద ఉన్న పుట్ట దగ్గర కుంకుమభరణి కనిపించింది. ఆ భరిణే సమ్మక్క గుర్తుగా తీసుకొస్తూ జాతరను నిర్వహిస్తున్నారు.

"దొంగ దెబ్బ తీసి దోచుకున్న రాజ్యం వీరభోజ్యం కాదని ఈ గడ్డపై పుట్టిన ప్రతి ఒక్కరు వీరుడిగానే రాజ్యం సంపాదించాలని అశరీరవాణి మాటలు ప్రతాపరుద్రునికి వినిపించాయి. తప్పు తెలుసుకున్న కాకతీయ రాజైన ప్రతాపరుద్రుడు ఆ పరిగణను కోయ రాజులకు వదిలేసి సమ్మక్క భక్తుడిగా మారాడు అని తెలుస్తుంది. అప్పటినుండి రెండు సంవత్సరాలకు ఒకసారి మేడారం జాతరను జరిపితే భక్తులు కోర్కెలు తీరుతాయని సమ్మక్క చెప్పినట్లు ప్రతీతి. అప్పటినుండి అక్కడ రెండు గద్దెలు కట్టించి సమ్మక్క ,సారలమ్మలుగా భావించి జాతర జరుపుతున్నారు.

జాతర సమయంలో శివసత్తుల పూనకాలు లక్ష్మీదేవికి మొక్కులు చెల్లించేవారు. సంతానం లేని స్త్రీల అమ్మవారి గద్దెల వద్ద వరాలు పడతారు. భక్తులందరూ అమ్మవారిని దర్శించుకుని బంగారం( బెల్లం) వస్తురూపమైన ధర రూపంలో హుండీలో వేస్తూ మొక్కు చెల్లించుకుంటారు.

ఆదివాసీల కోసం సమ్మక్క తల్లి కుటుంబమంతా వీరోచితంగా పోరాడి వీర మరణం పొందారు. వారి త్యాగం వృధా పోలేదు శతాబ్దాలు గడిచినా కుటుంబానికి జనులు నీరాజనాల అందిస్తూనే ఉన్నారు. సమ్మక్క పోరాటపటిమను స్ఫూర్తిగా తీసుకొని నేటితరం మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ, జరుగుతున్న అన్యాయాలకు తలవంచక న్యాయం కోసం ఉద్యమిస్తున్నారు. తమ జీవితాలను చక్కదిద్దుకుంటున్నారు. గుడి లేని సమ్మక్క తల్లిని ప్రజలు గుండెల్లో శాశ్వతంగా గుడి కట్టుకున్నారు. ఆమె పేరు నుండి మొదటి అక్షరం కలిసేలా తమ పిల్లలకు పేరు పెట్టుకుంటుంటారు ఈ ప్రాంత వాసులందరు.

శౌర్య పరాక్రమాల్లో తల్లి సమ్మక్కకు వారసురాలు సారలమ్మ కాకతీయ సేనలను తుద ముట్టించి క్రమంలో యుద్ధంలో వీరమరణం పొందింది .

## సారలమ్మ




సారలమ్మ ఊరట్టం గ్రామపంచాయతీ శివారులోని కన్నెపల్లెలో కొలువై ఉంది. భక్తుల కోరికలు తీర్చే తల్లిగా ప్రజలు విశ్వసిస్తారు. పగడిద్ద రాజు, సమ్మక్కల కుమార్తె సారలమ్మ కొండాయిలోని గోవిందరాజులును వివాహమాడింది. కాకతీయులతో జరిగిన యుద్ధంలో భార్యాభర్తలు ఇద్దరు వీరమరణం పొందారని ఒక కథనం .సారలమ్మ మేడరాజు బిడ్డని, పొలవాసులను ఓడించిన కాకతీయ రాజు రుద్రమదేవుడు ఆమెను పెళ్లి చేసుకుంటాననగా ఆమె నిరాకరించి, గోదావరిని దాటి కొండల్లోకి వెళ్లిందని

వేయి స్తంభాల గుడి శాసనం ద్వారా తెలుస్తోంది. అలా కన్యగా మిగిలిపోయింది గనుక ఆమె వెలిసిన ఊరు కన్నెపల్లి, కన్నేపురం, కన్నే పేటలు వెలిశాయని తెలుస్తోంది. సారలమ్మ కన్నె(బ్రహ్మచారిని) కనుక బ్రహ్మచారైన హనుమంతుని జెండా ఉంటుందంటారు.హనుమంతుని జండాతో కోయలు ముందు నడుస్తుండగా మేడారానికి అమ్మను తరలిస్తారు. గిరిజన పూజారులు కన్నెపల్లి గుడిలో మూడు పవిత్ర కుండలు (ఆదేరాలు )అలుగుతాడులు (వీరగోలలు) గంటలు ,పసుపు, కుంకుమ గుడి పక్కన ఉన్న నాగులమ్మ పుట్టకు వడ్డెలు పూజించి డోలి సప్పుల్లతో కాలినడకతో మేడారం తీసుకొచ్చి సమ్మక్క రావడానికి ఒక రోజు ముందు బుధవారం నిలపడంతోనే మేడారం జాతర ప్రారంభమవుతుంది.

తల్లి సమ్మక్క చిలకలగుట్ట నుండి చేరే ముందు సమ్మక్క భర్త పగిడిద్దరాజు, సారమ్మ భర్తగోవిందరాజులు గద్దెలకు చేరుతారు.

సారలమ్మ ఆలయంలో పూజారులు ప్రత్యేక పూజలు చేస్తారు సారలమ్మ గుడిని వారం పది రోజుల ముందే శుభ్రంగా కడిగి, ముగ్గులు పెట్టి పసుపు, కుంకుమలు మామిడి ఆకులతో అలంకరిస్తారు. నియమ నిష్టలతో కుంకుమ భరణిలను అమ్మవారికి ప్రతిరూపంగా భావిస్తారు. ప్రతి జాతర ముందు అడవి నుండి వెదురు కంకలను తీసుకొచ్చి బుట్ట అల్లుతారు. ఆ బుట్టలో కుంకుమభరణి పెట్టి డప్పు చప్పుల్లతో సారలమ్మను పూజారి బయటకు తీసుకువస్తాడు. బయట సంతానం లేని స్త్రీలు పుణ్య స్నానాలు చేసి సారలమ్మ గుడి ముందు బోర్లా పడుకుంటారు. సారలమ్మను తీసుకొచ్చే పూజారి వారిపైనుండి నడుచుకుంటూ జంపన్న వాగు దాటి గద్దెలపై చేరుకుంటారు . పూజారులు గురువారం సమ్మక్క గద్దెపైకి వచ్చిన తర్వాత సంప్రదాయ ప్రకారం జాతర ముగియగానే సారలమ్మను మేళతాళాలతో కన్న పల్ళికి చేరుస్తారు. మళ్ళీ వారానికి తిరుగు వారం అని అమ్మవారికి యధావిధిగా పూజలు నిర్వహిస్తారు గిరిజనులు.

## పగిడిద్దరాజు



పగిడిద్దరాజును పెన్క వంశీయులు కొలుస్తారు. మహబూబ్ నగర్ జిల్లా గంగారం మండలం పూనుగండ్ల లోని గిరిజనులు అటవీ ఉత్పత్తుల కోసం అడవికి వెళ్లారు. ఎండలో సేద తీరడానికి ఒక చెట్టు కిందకు వెళ్ళగా పగిడిద్ద రాజుకు సంబంధించిన చెవిపోగు పెన్క వంశీయులకు దొరికింది. ఆ చెవిపోగునే పగిడిద్దరాజుగా కొలవాలని పూనకం వచ్చి శివశక్తులు చెప్పడంతో, ఆ చెవిపోగునే

పగిడిద్ద రాజుగా కొలుస్తారు. సుమారు65 కిలోమీటర్ల అడవి గంలో నడుచుకుంటూ వెళ్తారు సారలమ్మ గోవిందరాజులు పగిడిద్ద రాజులు సమ్మక్క గద్దెని చేరే ముందు రోజే (బుదవారం)గద్దెలపై చేరుకుంటారు.

పూనుగొండ్లలో సమ్మక్క భర్త పగిడిద్ద రాజు ఆలయం ఉంది.

పగిడిద్దరాజు తండ్రి సముద్రుడు. చత్తీస్ ఘడ్ లోని కొత్తపల్లి రాజధానిగా పాలన చేసేవాడు. ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని సూరవీడు గ్రామానికి అవతల ఉన్న కొత్తపల్లి పరిసరాల్లోని 'దుర్గం గుట్ట 'శిథిరాలు కనిపిస్తాయి. సముద్రుడు నాగవంశానికి చెందిన రాజు. ఇతని బామ్మర్ది రెండవ మేడరాజు. పగిడిద్దరాజు పోనుగొండ్ల పాలకునిగా ఉండటంతో సమ్మక్కతో ఇక్కడే వివాహం జరిగిందని అంటారు. పగడిద్ద రాజు పడగలను డోలికోయలు తయారుచేస్తారు. దానిపై ఉన్న చిత్రలేఖనం ఆధారంగా పాటలు పాడుతారు. ఆ పడగను(జెండా) ఆదేరాలను (కుండలు)మాఘ పౌర్ణమి ముందు బుధవారం నాడు మేడారం తెచ్చి గద్దెపై నిలుపుతారు గురువారం వనదేవత సమ్మక్క గద్దెపైకి వస్తుంది.

కాకతీయుల సామంత రాజుగా సమ్మక్కకు భర్తగా ప్రజల పక్షం నిలిచిన రాజు పగిడిద్దరాజు. ప్రజలను కాపాడుకోవడానికి కాకతీయులకు ఎదురు తిరిగి పోరాడితే తీవ్రంగా గాయపడి గంగారం మండలం పూనుగండ్ల అడవి ప్రాంతానికి వచ్చి సైన్యంతో యుద్ధం చేస్తూ వీరమరణం పొందాడు. పెన్కవంశీయులకు అతనికి సంబంధించిన చెవిపోగు దొరకడంతో అదే పగిడిద్దరాజుగా భావించి పూజలు చేస్తున్నారు

కురుక్షేత్ర యుద్ధంలో రుక్మిణి ఇద్దరంగంలో భీకర పోరాటం చేస్తుండగా ఎదురుగా అర్జునుడు వేసిన బాణానికి తల తెగి అడవిలో నాయక పోడు తెగ వాళ్లకు దొరికింది రుక్మిణి తలను కృష్ణునికి అప్పగించేందుకు తీసుకువెళ్లారు తెలంగాణలో పడి ఉన్న రుక్మిణి గుర్తించిన కృష్ణుడు ఆమె ఉండడానికి గుర్రం తలను అమర్చేందుకు యజ్ఞం ప్రారంభించాడు

యజ్ఞే సమయానికి ఇరుక్కుని తీసుకొచ్చిన తలను జత చేశారు నిజంగా ఉన్న గుర్రం తెల్లగా సైతం ప్రాణం రావడంతో ప్రాణం వచ్చిన గుర్రం తనకు లక్ష్మీదేవతగా వారికి బహుమతిగా అందిస్తాడు కృష్ణుడు అందించిన లక్ష్మి దేవత గుర్రం ప్రతిమ నాయక పోతే వారు తమ గుడిసెలలో ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తారు ఆనాటు వంటి వారు లక్ష్మీదేవిని వారి ఇలవేల్పుగా భావిస్తున్నారు మీరు తొలి ఏకాదశి పండుగ రోజు అమ్మవారిని కొలుస్తారు కుల పెద్ద పూజారి లక్ష్మీదేవి ప్రతిమ వచ్చేటప్పుడు లే వాయిద్యాలతో తొలి తొలి ఏకాదశి ఉదయాన్నే గర్భగుడిని ఊపిరి గడ్డితో అలంకరించి గోదావరి నదిలో స్నానాలు చేస్తారు గుడికి వచ్చేటప్పుడు ప్రజలు వాళ్ల ముందర నీళ్లు పోస్తారు నీళ్లు పోస్తూ పరుగుల దండాలు పెట్టుకుంటారు భక్తులపై లక్ష్మీదేవి ఎవరైనా నడిచి వెళుతుంది దీంతో వారికి మంచి జరుగుతుందని కష్టాలు తొలగిపోతాయని నమ్మకం అప్పుడు ఎవరు నువ్వు మేడారంకే తీసుకువస్తారు

## జంపన్న వాగు



గిరిజన కుంభమేలగా పిలిచే మేడారం మహాజాతరకు వచ్చే లక్షలాదిభక్తులు అక్కడే ఉన్నా కళ్యాణ కట్టలవద్ద పుట్టు వెంట్రుకలు చిన్నా, పెద్దలు సమర్పించుకొని జంపన్న వాగులో పుణ్యస్నానాలు చేస్తారు. సమ్మక్క, సారలమ్మ గద్దెలతో పాటు జంపన్న వాగుకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. ప్రతి ఒక్కరూ పసుపు కుంకుమలు సమర్పించి వాగులో కొబ్బరికాయలు కొట్టి అక్కడ ఉన్న చెట్టును నాగులమ్మగా కొలుస్తూ ముడుపులు కడుతుంటారు. కొన్ని వాగుల కలయికతో ప్రవహించే జంపన్న వాగు ఎటునాగారం అడవుల్లో గోదావరి నదిలో కలుస్తుంది .ఆనాటి సంపంగి వాగే నేటి జంపన్న వాగుగా మారింది.

## చారిత్రక కథనం ప్రకారం

సమ్మక్క పగడిద్దరాజు దంపతుల కుమారుడు జంపన్న. కాకతీయుల రాజులతో జరిగిన యుద్ధంలో వీరోచితంగ పోరాడుతుంటే అతన్ని హతమార్చాలని సైనికులు దొంగ చాటుగా బల్లెంతో పొడిచారు. ప్రాణిపాయ స్థితిలో ఉన్న జంపన్న శత్రువు చేతుల్లో ప్రాణాలు కోల్పోవడం అవమానంగా భావించి సమీపంలోని సంపంగి వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటినుండి ఆ వాగు జంపన్న వాగుగా ప్రసిద్ధిగాంచింది.



## గట్టమ్మ

కోట్లాదిమందిని మురిపించి మైమరిపించేది సమ్మక్క జాతర.సమ్మక్క జాతరకు వచ్చే భక్తుల మొదటి మొక్కలు గట్టమ్మ తల్లి వద్ద చెల్లించుకుంటారు. ములుగు సమీపంలోని జాగారం గ్రామ శివారులోని (గట్టమ్మ పల్లె) ప్రేమనగర్ వద్ద గట్టమ్మ కొలువై ఉన్నది. ఈ ప్రదేశాన్ని గేట్వే ఆఫ్ మేడారం అని కూడా అంటారు. మేడారం

ముఖద్వారం అంటారు. ఇక్కడకు వచ్చిన భక్తులు ఏ అవాంతరాలు లేకుండా మేడారం జాతరకు వెళ్ళి తిరిగి ఇళ్లకు సురక్షితంగా వెళ్లాలని మొక్కుకుంటారు. గట్టమ్మ తల్లికి చీరాసారె పసుపు, కుంకుమ ఒడి బియ్యం, బెల్లం కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకుంటారు.

## చారిత్రక కథనం ప్రకారం

ఆదివాసి నాయక పోడుల ఇలవేల్పు గట్టమ్మ. కాకతీయుల సైన్యంతో పోరాడి ప్రాణాలు అర్పించిందని కథనం. ఘట్టమతల్లితో సహా ఏడుగురు కుటుంబ సభ్యులు వీరంతా మేడారం చుట్టూ ఉన్నారు .ములుగు దగ్గర ఉన్న గుట్టపై వెలసిన గట్టమ్మ దేవత కుటుంబంలో పెద్దది. ఈమెచెల్లెండ్లుగా చెప్పుకుంటున్నవారు ఇంచర్ల గ్రామపంచాయతీ శివారులో జాతీయ రహదారిపై ఎర్రగట్టమ్మ ఒకరు, వెంకటాపురం మండలం రామకృష్ణాపురం సమీప అడవుల్లోని గుండ్లవాగు గట్టమ్మ ఒకరు, కమలాపురం రాంపూర్ మార్గంలోని అడవిలో వెలసిన గట్టమ్మ ఒకరు, భూపాలపల్లి కమలాపురం, రాంపూర్ మార్గంలో అడవిలో గట్టమ్మ, దూదేకులపల్లి, బయ్యక్కపేట అడవి మార్గంలో ఒక గట్టమ్మ.

ఎటూర్ నాగారం ,చల్వాక మార్గంలో ఒక గట్టమ్మ. తాడ్వాయి మధ్యగల జలగలంచ వద్ద ఒక గట్టమ్మతో కలిసి ఏడుగురు అక్క చెల్లెలు వీరంతా జనుల తో పూజలు అందుకుంటున్నారు.

సమ్మక్క సారలమ్మలకు రక్షణగా వీరు ఉన్నట్లు కథనం.

పగిడిద్ద రాజు పై కాకతీయులు యుద్ధం ప్రకటించారు. యుద్ధానికి వస్తున్న కాకతీయులను ములుగు దగ్గర ఉన్న గట్టమ్మ మరియు గిరిజనులు అడ్డుకున్నవారందరిని హతమార్చి మేడారం చేరింది కాకతీయు సైన్యం. కాకతీయులతో వీరోచితంగా పోరాడిన పగిడిద్దరాజు కుటుంబం హీరోచితంగా పోరాడారు.వీరిని నిలువరించలేని సైనికులు సమ్మక్కను, జంపన్నను వెనుక నుంచి పొడిచి చంపారు. అలా పగిడద్ద రాజు కుటుంబం అంతా యుద్ధంలో వీరమరణం పొందారు.

ములుగు వద్ద ఉన్నగట్టమ్మను నాయక పోల్లు మేడారం జాతరకు ముందే ఈ పండుగను నిర్వహిస్తారు. ములుగు నుండి డప్పుసప్పుళ్ళతో వెళ్లి పసుపు కుంకుమలతో పూజిస్తారు. మేడారం వెళ్లే భక్తులంతా ఇక్కడ దిగి మొక్కలు చెల్లించుకుని వెళ్తారు.

## సమ్మక్క ఆడ పడుచు లక్ష్మీదేవర



గణపురం మండలం నగరంపల్లిలో కొలువై ఉంది. నేటికీ ఆమె మహిమలు వెదురు చెట్టు రూపంలో కనిపిస్తాయంటారు. ఆ అమ్మ వారు సమ్మక్క కుటుంబం కంటే ముందే మేడారం చేరుకుంటుంది.

రెడ్డి మేకల వంశీయులు గుర్రం తల రూపంలోని అమ్మవారి ప్రతిమను కాలినడకన మేడారం తీసుకొస్తారు.

## చారిత్రక కథనం ప్రకారంలక్ష్మీదేవర

లక్ష్మీదేవర గుర్తుగా భావించే ఈమె గుర్రం ఆకారం ప్రతిమతో ఉంటుంది. నాయకపోడు గిరిజన తెగకు లక్ష్మి దేవత ఇలవేల్పు.

కురుక్షేత్ర యుద్ధంలో రుక్మిణి యుద్ధరంగంలో భీకర పోరాటం చేస్తుండగా ఎదురుగా అర్జునుడు వేసిన బాణానికి తల తెగి దట్టమైనఅడవిలో పడగా నాయక పోడు తెగ వాళ్లకు దొరికింది. రుక్మిణి తలను కృష్ణునికి అప్పగించేందుకు తీసుకువెళ్లారు. అప్పటికే యుద్ధరంగంలో పడి ఉన్న రుక్మిణి మొండెంను గుర్తించిన కృష్ణుడు ఆమె మొండానికి గుర్రం తలను అమర్చేందుకు యజ్ఞం ప్రారంభించాడు.

యజ్ఞ సమయానికి రుక్మిణి తలతో వచ్చిననాయకపోళ్ళను అభినందించి రుక్మిణి మొండానాకి తలను జతచేశారు. అక్కడ సిద్ధంగా ఉన్నఅగుర్రపు సైతం ప్రాణం రావడంతో గుర్రం తలను లక్ష్మీదేవతగా వారికి బహుమతిగా అందిస్తాడు. కృష్ణుడు అందించిన లక్ష్మి దేవత గుర్రం ప్రతిమ నాయక పోఢువారు తమ గూడెంలో గుడి ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. ఆనాటినుండి లక్ష్మీదేవిని వారి ఇలవేల్పుగా భావిస్తున్నారు. వీరు తొలి ఏకాదశి పండుగ రోజు అమ్మవారిని కొలుస్తారు కుల పెద్ద పూజారి లక్ష్మీదేవి ప్రతిమ ను ధరించి వచ్చేటప్పుడు మంగళ వాయిద్యాలతో గర్భగుడిని ఊపిరి గడ్డితో అలంకరించి గోదావరి నదిలో స్నానాలు చేస్తారు గుడికి వచ్చేటప్పుడు ప్రజలు వాళ్ల ముందర నీళ్లు పోస్తారు నీళ్ల పోస్తూ పరుగుల దండాలు పెట్టుకుంటారు భక్తులపై లక్ష్మీదేవి ఎవరైనా నడిచి వెళుతుంది దీంతో వారికి మంచి జరుగుతుందని కష్టాలు తొలగిపోతాయని నమ్మకం అప్పుడు ఎవరు నువ్వు మేడారంకే తీసుకువస్తారు.

కురుక్షేత్ర యుద్ధంలో రుక్మిణి ఇద్దరంగంలో భీకర పోరాటం చేస్తుండగా ఎదురుగా అర్జునుడు వేసిన బాణానికి తల తెగి అడవిలో నాయక పోడు తెగ వాళ్లకు దొరికింది. రుక్మిణి తలను కృష్ణునికి అప్పగించేందుకు తీసుకువెళ్లారు.యుద్ధరంగంలొ పడి ఉన్న రుక్మిణి మెండెంను గుర్తించిన కృష్ణుడు ఆమె మొండానికి గుర్రం తలను అమర్చేందుకు యజ్ఞం ప్రారంభించాడు.

యజ్ఞే సమయానికి రుక్మిణి తలతో వచ్చిన వారిని అభినందించి, రుక్మిణి మొండానికి వారు తీసుకు వచ్చిన రుక్మిణి తలను జతచేశారు. యజ్ఞ ఫలితంగా అక్కడ సిద్ధంగా వున్న గుర్రం తలకు సైతం ప్రాణం వచ్చింది.

ప్రాణం వచ్చిన గుర్రం తలను లక్ష్మీదేవతగా వారికి బహుమతిగా అందిస్తాడు.

శ్రీ కృష్ణుడు ఇచ్చిన లక్ష్మీదేవత గుర్రం ప్రతిమను నాయకపోడు తెగవారు తమగూడెంలో గుడి ఏర్పాటుచేసి పూజలు నిర్వహిస్తారు. ఆనాటినుండి వారు లక్ష్మీదేవరను ఇలవేల్పుగా కొలుస్తున్నారు.

## తొలి ఏకాదశి పండుగ రోజు

కులపెద్ద పూజారి లక్ష్మీదేవర(లచ్చిందేవర)ప్రతిమను ధరిస్తాడు.డప్పు,డోలి వాయిద్యాలతో ఉదయాన్నే గర్భగుడిని కోపిరి గడ్డితో అలంకరించి గోదావరి నదిలో స్నానాలు చేస్తారు. పూనకాలతో గుడికి వచ్చేటప్పుడు ప్రజలు వాళ్ళ ముందర నుళ్ళు పోస్తు పొర్లు దండాలు పెట్టుకుంటారు.భక్తులపై

నుండి లక్ష్మీదేవర నడిచి వెళ్తుంది. దీంతో అనుకున్న కోరికలు తీరూతాయని, మంచి జరుగుతుందని, కష్టాలు తొలిగిపోతాయని నమ్మకం.మేడారం జాతరప్పుడు గుర్రం వేషాలతో భక్తులను అలరిస్తారు.

## గోవిందరాజులు



గోవిందరాజులు సమ్మక్కకు మరిదని, బ్రహ్మచారని అంటారు .ఆమె భర్త పగిడిద్ద రాజుకు తమ్ముడని అక్కడ వడ్డెలు చెప్తారు. కొందరు గోవిందరాజు సారలమ్మ భర్త అంటారు.

గోవిందరాజులు దబ్బకట్ల వంశీయుడు.వంగరంగల్ జిల్లా కేంద్రానికి 150 కిలోమీటర్ల దూరంలో గల ఎటునాగారం మండల కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో వెలసిన కొండాయి గ్రామంలో కొలువై ఉండి, ఆదివాసి కోయలతో పూజలు అందుకుంటున్నాడు ఆదివాసీలు ఇతన్ని కురువంశస్తులైన పంచపాండవులలోని ధర్మరాజు లా దానధర్మాలు చేసే గుణం ఉన్నవాడిగా ఇక్కడి ఆదివాసీలు చెప్తారు.

పగిడిద్దరాజుకు తోడుగా కొంత ప్రాంతాన్ని పాలించాడని ఈయన పడగపయిన,సైన్యం పరివారము చిత్రాలు కనిపిస్తాయి . ఈ పడగలను వడ్డెలు పవిత్రంగా భావిస్తారు. పడగను జాతర సందర్భంలోనే బయటకు తీస్తారు .ఆ పడగలను గోవిందరాజుగా భావించి కొలిచి మేళ, తాళాలతో మేడారం ముందు రోజు బుధవారం తీసుకొస్తారు. మళ్ళీ శనివారం కొండాయి గ్రామానికి తీసుకెళ్తారు.

గోవిందరాజు గుడికి ఎడమ ప్రక్కన నాగులమ్మ (ఇలారం) గడ్డితో కట్టిన గుడిసె ఉంది. గోవిందరాజు గుడి బయట ఈశాన్యంలో ఉన్న అరెచెట్టు కింద ఉన్న విగ్రహాల్లో రెండు అమ్మవార్ల విగ్రహాలు ఉంటాయి. అవి త్రిశూలం,డమ రుకంలతో దర్శనమిస్తాయి. వాటిలో ఒకవిగ్రహాన్ని పోచమ్మగా కొలుస్తారు. మరో విగ్రహం బుడిపెలుతేలి సుందర శిల్పంగా కనిపిస్తుంది.దీనిని ముత్యాలమ్మగా కొలుస్తారు.

మేడరం జాతర లేని సమయంలో మాఘశుద్ధ గురువారం వస్తాయి. వారం రోజుల ముందే గుడిమెలిగ పండుగ చేస్తారు. ఆలయాన్ని శుభ్రం చేసి గుడిలోని ఆడే రాళ్లను (కుండాలను) శుద్ధి చేసుకుని జాతర నిర్వహిస్తారు. సమీపంలోని గుట్ట నుండి వనం తీసుకొచ్చి జాతర నిర్వహిస్తారు. తర్వాత కొండాయిలోని గద్దలపై ప్రతిష్టంప చేసి ఒకరోజు గద్దెపై ఉన్న తర్వాత మరుసటి రోజు వన ప్రవేశం చేయిస్తారు. మళ్ళీ తిరిగి వారం పండుగ నిర్వహిస్తారు.

సమ్మక్క జాతరను ప్రభుత్వంప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నది. అన్ని సౌకర్యాలు కలిగిస్తున్నది.

పట్టణాన్ని తలపించే సౌకర్యాలతో అడుగడుగున

పోలుసులతో ,వాలంటీర్లతో

ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా జాగ్రత్త పడుతున్నారు. మేడారం గద్దెల వద్ద నిర్మాణాలు చేపడుతున్నారు.

గిరిజన సంస్కృతీ సంప్రదాయ వైభవాలను స్తంభాలపై చిత్రిస్తున్నారు.సాలు విడిచి సాలుకొచ్చే సమ్మక్కజాతరకుంభమేళగా ప్రసిద్ధి పొందుతోంది.



-డా॥ బండారి సుజాత
9959771228

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1683వ రోజు 'కీర్తి కండూతి' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'కీర్తి కండూతి' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. -సంపాదకులు



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839

## వైరల్ ఫీవర్!

విత్తుగా మొలకెత్తిందంటే
మానై ఎదిగిపోతోంది
నటిస్తుంది
వెంట పడుతుంది
అందాలని, అందుకోవాలని
వేషాలు వేస్తుంది
వేయిస్తుంది.
పక్కన చేరుతుంది
ప్రశంసలతో
దుమ్మెత్తి పోస్తుంది
ఆశిస్తుంది
అందరిలో నేనొక్కడినే
నిలవాలని
అన్నీ తానై
సొంతం సొంతం కావాలని
అదృష్టంతో పోటీ పడుతుంది
అత్యాశల అంగట్లో
అమ్ముడు పోతుంది.
కీర్తి కండూతి లేని వ్యక్తిత్వం
అతిశయానికి లొంగదు
ఆడంబరాలను
అనునయించదు
ప్రతిభా నైపుణ్యాల సాధనలో
అనవరతం పోటీపడుతుంది
సత్సాంగత్యాన్ని
కోరుకుంటుంది
ఎంత ఎత్తుకు ఎదిగినా
ఒదిగి ఉంటుంది
నిత్య విద్యార్థిగా జీవిస్తుంది.
-పి.పద్మావతి

## కీర్తికి లేని కిరీటం

కీర్తి ప్రతిష్ఠల కోసం
రకరకాల ప్రయత్నాలు
ఒక్కొక్కరూ ఒక్కోరకంగా.
స్వచ్ఛంగా
ఏ స్వార్థానికి తలవంచకుండా
తన పని తానూ చేసుకుంటూ
ప్రజలకు
చేతనైనంత సహాయం చేస్తూ
చేసిన దానిని చెప్పకుండా
మౌనంగా ప్రజా సేవల్లో
నిమగ్నమైన వారిని
కీర్తి ప్రతిష్ఠలు
వెతుక్కుంటూ పోతాయి.
కీర్తి ప్రతిష్ఠలకోసం
ఈనాటి మనుషులు
గోరంత సహాయం చేసి
కొండనీత ప్రచారం కోసం
బట్ట నలుగకుండ
జుట్టు చెదరకుండ
ఫోటోలకు పోజులిచ్చి
సోషల్ మీడియాకు
ఎక్కుతున్నారు
పత్రికల ప్రచారంలో
ముందే ఉంటున్నారు.
అందరి మెప్పు పొంది
సమాజనోళ్ళలో నానడానికి
పిల్లికి భిక్షం వెయ్యని
పెద్ద మనిషి
తెల్ల బట్టలు వేసుకొని తయారు
తల రాతను
తారుమారు చేయడానికి
శాలువాతో సలాం చేస్తున్నారు
దండ వేసి దండం పెట్టి
అధికారంలోని అధిపతికి
చుట్టాన్నని
రాజకీయ నాయకులకు
బంధువునని
ప్రజా సేవ చేసే పని
మంతులమని
చెప్పుకుంటున్నారు
బతుక నేర్చిన బలాదూర్లు
పేరు ప్రతిష్ఠల కోసం
పరుగులు పెడుతున్నారు
కీర్తి లేని కిరీటం
పొందుతున్నారు.
అసలైన పేరు ప్రతిష్ఠ
కోరకుండా రావాలి
ఆశ పడకముందే ఆవరించాలి.
-పొన్నాల ధనమ్మ

## సన్మాన ప్రియులూ, బహు పరాక్!

సన్మాన ప్రియులూ, బహుపరాక్!
చేసింది ఆవగింజంతైనా
కొండంతగా చెప్పే అనుచరులతో
చప్పట్లు కొట్టే వందిమాగధులతో
అందమైన కోటూ బూటూలతో
వేదికెక్కి
కండువాలు కప్పించుకొని
ఆర్భాటంగా
సన్మానాలు చేయించుకునే
కీర్తి కండూతికై
ప్రాకులాడే వారెందరో!
చేతికి ఎముకే లేదని...
బాధలలో ఎదుటివారిని
చూస్తే ఆగలేదని
పేదలకు పుస్తకాలు ఇప్పిస్తాడని
పాత బట్టలు పంచుతాడని పేరు!
గృహోపకరణాలు అందించి
కూరలు, పళ్ళు పంచి
మాట సాయాలు అందిస్తూ
ధర్మదాత అనిపించుకోవాలనే
కీర్తి కండూతి కొందరికి
ప్రశంసాపత్రాలు పొందాలని తపన
ప్రథమ విజేత కావాలని తాపత్రయం
కీర్తికై కాకాలు పట్టి దిగజారడం
అవార్డుల కోసం అర్రులు చాచడం
కీర్తి కండూతి కోసం చేస్తారు!
ఓ పెద్దాయనకు స్టేజిపై సన్మానం!
ప్రముఖులు వచ్చి కరచాలనాలు!
ఆ సన్మాన మత్తులో చూసుకోక
ఇంటికి పోయి చూస్తే లేవుగా
చేతి వేళ్లకు ఉండే ఉంగరాలు!
అతనిక సన్మానాల జోలికి పోలేదు!
ఇదండీ కీర్తికండూతి మహిమ!!.
-కోలా సత్యనారాయణ

## దురద బురద

బుర్రంతా దురద
ఒళ్లంతా గోకుడు
గీకుడూ బరుకుడు
నెత్తిన పేలైతేదువ్వి దువ్వి చంపొచ్చు
ఫేమస్ కావాలి
నల్గురినోళ్లలో నానాలంటే
ఏం చేయాలిరా తమ్మయ్య?.
ఏడ జూసినా కతలు కైతలకి గిరాకాయే
పూలదండలు
వెచ్చంగ శాలువలు
కప్పుతుండారు
నాకు కథ కైత రాదయ్యే!?.
అరె, తామరతంపలెక్క
పేరుకోసం పరుగులు
అంతటా తానై వెలగాలనే వైరస్
ఆనాడు విశ్వామిత్రుడు
కడుపుబ్బి
బ్రహ్మర్షి అనిపించుకోవాలనే కాంక్ష
దానకర్ణుని మించాలనే తహతహతో
చతికిలబడిన దుర్యోధనుడు.
కీర్తికిరీటాలకై
భుజకీర్తులకై పరుగులు
కండువాలు మారుస్తూ
తెల్లారినంక ఎవరు ఏపార్టీనో
తెలీని అయోమయంలో.
రైకలు కోకలు
పైట గోలలతోరేటింగ్ కై
మీడియాల పరుగులు
గుర్తింపుకోసం నల్గురినోళ్లలో నానితే
ఆస్కార్ బరిలో నిల్వచ్చనే దురాశ
పేరాశ తో భామలు
ఊర్వశి అవార్డు ఊసులేక
సలహా ఇచ్చినోడిని
బదనామ్ చేసేటోల్లు
ఆహా! ఇదే కదా!కీర్తి కండూతి!
దీనికి యాంటిబయోటిక్ ఉందా శ్రీపతీ!?
-ఎ.రాజ్యశ్రీ

## శాంతి తీరాల శిథిలం

అగాధ హృదయ సాగరంలో
ఆశలూ ఆశయాల అలజడుల్లో
అతిశయాల ఆవర్తన
తుఫానుల నడుమ
కీర్తి కండూతి అనే క్రూర తరంగం
మనసు మర్మస్థానాన్ని
మళ్లీ మళ్లీ తాకి
శాంతి తీరాల్ని శిథిలం చేస్తుంది.
కీర్తి సహజంగా కల్మషంకాదు
దానిపై పుట్టే అతిలోభమే
కండూతిగా రూపాంతరం చెంది
అహంకార బీజాన్ని హృదిలో
నాటుతుంది.
మొగ్గ తొడిగి
కాలప్రవాహంలో దర్పమై
దురహంకారంగా
పక్వమవుతుంది.
తనను గుర్తించాలనే తపన
అంతరాత్మపై
తలక్రిందులుగా వేలాడి
స్వార్థ మూలాల్ని తవ్వి
మూర్ఖత్వాన్ని వెలికితీస్తుంది
ప్రశంసల మధువు
మత్తెక్కిన హృదయం
మరింత రుచి కోరుతూ
తీరని అసంతృప్తి
అగ్నిలో కాలుతుంది.
నేటి ప్రశంసరేపటికి అపూర్ణం
రేపటి ఖ్యాతి
మరునాటికి మసకబారుతుంది.
భిక్షాటనగా మారిన
కీర్తి వెదుకులాటలో
మనిషి గుణధనంలో
దరిద్రుడవుతాడు.
నిజమైన ప్రతిభకు
నిశ్శబ్దమే భూషణం,
నిఖార్సైన వెలుగు
ప్రచార దీపాల్ని ఆశ్రయించదు.
కీర్తిని వెంబడించేవాడు
అపకీర్తి అంచున నిలుస్తాడు
కర్తవ్యాన్ని ఆరాధించేవాడినే
ఖ్యాతి వినయంగా వరిస్తుంది.
గంగ తన గొప్పతనాన్ని
ఎక్కడా ప్రకటించదు,
అయినా లోకమంతా
ఆ నది కీర్తిని గానం చేయదా?.
మహనీయుల జీవితాలే
స్వయంసాక్ష్యాలు
వేదికలూ ప్రకటనలూ
అవసరమే లేదు.
కీర్తి కండూతిని జయించినవారే
నిజమైన విజయశిఖరారోహులు
పేరు కోసం కాదు
విలువ కోసం జీవించు,
ప్రశంస కోసం కాదు
ప్రమాణం కోసం పనిచేయు.
కీర్తి వెనుక నడిచేది
నీడ మాత్రమే
వెలుగై నడిచిన నాడు
నీడ తానే
నీ అడుగులను అనుసరిస్తుంది.
అదే......మనిషిని
మహోన్నత కీర్తి శిఖరాలపై
నిలిపే నిత్య
నిశ్చల నిచ్చెనవుతుంది.
-నాగరాజు చుండూరి

## "కవి భగీరథ"

ఆయనొక మహాకవి
సృజనాత్మకతతో
సామాజిక స్పృహతో
సమస్యలపై అక్షర శస్త్రాలను
సంధించే కలం యోధుడతడు.
ఇలా అనిపించుకోవాలని
అందరితో
అలా పిలుపించుకోవాలని
ఒకటే కీర్తి కండూతి నాకు
ఎలా రాయాలో
దేనిస్పృశించాలో
దేనిపై స్పందించాలో
ఎంత ఆలోచించినా
తెలిసి చావదు నాకు
అందుకే ఎందరి పుస్తకాలో
సేకరించి చదవాలనుకున్నా.
పుస్తకాలకై
చేతి చమురొదిలింది కానీ
చదివేందుకు ఓపికే చస్తే రాలేదు.
ఇలా కాదని
ఎందరో
ప్రఖ్యాత కవులందరినీ కలిశా
వారి సాంగత్యంతోనైనా
నాలో కవి పుడతాడేమోనని
పుట్టడం అటుంచి
వాళ్ళకు మర్యాదలు చేసేందుకు
అప్పులపాలయ్యా.
అయినా విడిచిపెట్టేదే లేదని
దృఢంగా అనుకున్నా.
ఎక్కడ కవి సమ్మేళనం జరిగినా
అక్కడ హాజరవుతూనే ఉన్నా...
ఒకరో యిద్దరో
నా చమురు ఒదిలించిన వారు
కనిపించకపోరని..
రాని నవ్వుల్ని పులుముకొని
వారికి అత్యంత ఆత్మీయునిగా
అందరికీ కనిపించాలని
తాపత్రయ పడుతూనే ఉన్నా.
మరీ
అక్షరం ముక్క
రాని వాణ్ణేం కాదుకదా
అందుకే ఇక తప్పదని
పూర్తి కాపీ కొట్టకపోయినా
పదాలు మార్చేసి
ఒకటి రెండు ప్రయత్నించా
ఇవి కవితలే కాదని
ఎవరూ బాహాటంగా
అనరనే ధైర్యంతో.
అలా అలా
ఇతనూ ఓ కవే
అనే పేరైతే సంపాదించాననుకుంటా
కానీ తృప్తెందుకో కలగట్లేదు
కోరుకున్న కీర్తి దక్కట్లేదు.
అందుకే
పురాతన పుస్తకాల్లో
అంతగా గుర్తింపు లేని
కవితల తలలూ మొండాలను
కొంచెం కొంచెంగా మార్చి
గొప్ప కవిగా
పేరు ప్రఖ్యాతలకై
ఆరాట పడుతూనే ఉంటా
అది వచ్చేవరకు
పాత కవితలకు
ఇలా శస్త్ర చికిత్సలు చేస్తూనే ఉంటా!.
-గుర్రాల వేంకటేశ్వర్లు

## కృత్రిమ మెరుగు

కీర్తి చంద్రికల
పరమవైభవంలో మనిషి
చేసేది కొంత
చెప్పేది ఎంతెంతో
శ్రమ స్వల్పం
ప్రచారం అనంతం
కీర్తి కండూతిలో
నవీన జనవాహిని
వేదికలపైన
ఊకదంపుడు ఉపన్యాసాలు
సృజనశీలత ఎంతోగాని
ప్రచారం బహుముఖం
బహుముఖ ప్రజ్ఞాశాలి
కీర్తి దురంధరుడని
ప్రచారపు మోతలో
కీర్తి తమదేనని
ఎవరు వినని కనని
బిరుదులతో కీర్తి కిరీటాలు
ప్రతిభా పురస్కారాల ప్రదానంలో
రాజకీయాలెన్నో
సుదీర్ఘ మార్గాలు వీడి
అడ్డదారులు
భజన బృందాలు
భక్త బృందాలతో స్తోత్రపఠనాలు
డబ్బులు ఇచ్చి
ప్రచారపు ప్రయాణం
శాలువాలు సత్కారాలతో
స్తోత్కర్షలు
చెప్పిందెంతో
చేసింది ఎంతో గాని
సభలు సన్మానాలు
తెర వెనుక రాజకీయం ఎంతో
మేడి పండులా
సమాజ వ్యవహారాలు
బయటికి హుందాగా అగుపించు
లోపలివన్నీ చెత్త పనులు
చెత్త రాజకీయాలు
స్వచ్ఛతకు
ముసుగులు కప్పుకున్న వైనం
సమాజం మారేదెన్నటికో
కృత్రిమ మెరుగు వీడేదెన్నడో.
- లక్ష్మారెడ్డి పసుల

## శ్రమల ఫలము

నేను పిపాసినే జగతి స్నేహములోన
సుధారసమ్మునే
పానము జేసి కీర్తి కడు భక్తిగ పంచి
మహత్తరంపు;స
న్మానము పొంది కొందరికి మైత్రిగ
నేర్పుచు విస్తరించగా
స్నానము చేయ బూనితిని సాహితి
సేవల వీలు కొద్దిగన్.
కండూతి కోరనెప్పుడు
దండిఫలమ్ములను పంచి దగ్గరజేర్చన్
పండితులందరికొప్పగ
వండినరుచులను
వరలగ వాక్కులనిడుదున్!!.
శ్రమల ఫలము వలయు చక్కని
పొలములో
సహజమైన పంట శక్తి మేర
కీర్తి కోరగలను కించిత్తు న్యాయమై
శాశ్వతమ్మునుండు విశ్వముందు.
-మాడుగుల నారాయణ మూర్తి

## ప్రేమగా నిలిచిన ప్రేరణ

కీర్తి కండూతి
నా మనసు చలించింది
నిన్ను చూసిన
మొదటి క్షణమే
మనసు
మౌనంగా నమస్కరించింది,
కీర్తీ!.
నీ పేరు పలికితేనే
హృదయం వెచ్చబడుతుంది,
అది అలవాటు కాదు
అనుబంధం.
కండూతి
వంశం కాదు
విలువల ముద్ర,
నిలకడకి నిలువెత్తు ప్రతీక.
అది ప్రేమో?
గౌరవమో?
తెలియని భావోద్వేగమో
ఇప్పటికీ నాకు స్పష్టంగా తెలియదు.
నీ చూపుల్లో
మాటలకన్నా ఎక్కువ అర్థం
నీ మౌనంలో
కలకన్నా గాఢమైన ప్రేమ
నీవు నవ్వితే
ప్రపంచం తేలికైపోతుంది,
నీవు ఆలోచిస్తే
కాలమే ఆగినట్టు అనిపిస్తుంది.
నీ ప్రేమ అగ్ని కాదు కాల్చడానికి,
అది దీపం చీకటిలో దారి చూపడానికి.
నీ సాన్నిధ్యం మేఘం కాదు ముసరడానికి,
వర్షం ఎండిన మనసులకు
ప్రాణం పోసేందుకు.
నీ మాట ఒక ఆశ్వాసం
నీ నడక ఒక నమ్మకం
పడిపోయినవాడిని లేపే చేయి నీది
విజయాన్ని వినయంగా
మోయగల భుజం నీది.
ఎన్ని సార్లు కుంగిపోయానో
నాకు తెలుసు
ప్రతి సారి నిలబడ్డానంటే
అందులో నీ ప్రేరణే కారణం
నీవు నమ్మావన్న ఒక్క కారణంతో
నేను నన్ను నేనే నమ్మగలిగాను.
ప్రేమంటే చెప్పాల్సిన మాటలు కాదు
చూపించాల్సిన సమయం.
నీవు ప్రేమను అరవలేదు
నిశ్శబ్దంగా జీవించి చూపించావు.
గౌరవమంటే
భయంతో వంగడం కాదు
నీ ముందు తల వంచాలని
మనసే కోరుకోవడం.
నీ ప్రేమ నా బలహీనత కాదు,
నా శక్తి.
నీ గౌరవం
నా అలంకారం కాదు,
నా గుర్తింపు.
ఈ లోకంలో అన్నీ మారినా
నీ విలువలు మాత్రం అచంచలం
కాలం నీ పేరు మరిచినా
మనసులు మాత్రం మర్చిపోవు.
ఎందుకంటే
నీవు మనసుల్లో
ప్రేమగా నిలిచిన ప్రేరణవు
గౌరవంగా మిగిలిన నా హృదయానివి.
-గుండవరం కొండల్ రావు

## తీరని కోరిక

అద్వితీయమైన ఆశ
అందుకోలేని జిజ్ఞాస
ఆశలని మించిన అడియాస
చిన్న నోట గొప్ప అరుపులు.
గోవిందా స్వరూపాలు
తక్కువ ఆలోచనలు
నికృష్టపు చేష్టలు
ఇతరులకు కష్టం కలిగించి
బాధ కలిగించి పొందే
నికృష్టపు చర్య.
భారతీయతతో
భావితరానికి
దీపికలా వెలగాలంటే
నీతితో చర్యలు
నిరంతర ప్రభావిత
వెలుగుల దారి
చూపాలి పదిమందికి,
దౌర్భాగ్య ఆలోచనలు
దూరం చేసి
నవ్యత తో కూడిన
భవితని అందించు
నలుగురు
గొప్ప చెప్పుకునేలా చేయి
మానవత్వం పెంచు
మంచిని నేర్చుకో
మనిషిగా బతుకు !!!.
-కె.కె.తాయారు

# పురుష దృక్కోణంలో స్త్రీవాదం

**డా॥సి.హెచ్.సుశీలమ్మ రచన "స్త్రీవాది-పురుష రచయితలు" పుస్తకానికి డా॥శిఖామణి రాసిన ముందు మాట**

డా॥సి. హెచ్. సుశీలమ్మ చిరకాలం తెలుగు అధ్యాపకురాలిగా పనిచేసి, ప్రిన్సిపాల్ హోదాలో రిటైరయ్యారు. కిన్నెరసాని పాటలపై ఎం.ఫిల్, ముళ్ళపూడి వెంకటరమణ రచనలపై పి. హెచ్.డి. పరిశోధ నలు చేసారు. అధ్యాపనం, అధ్యయనం, సృజన ముప్పేటలు గా పెనవేసుకున్న సాహితీ వ్యక్తిత్వం, వాటి ప్రతిఫలమే ఈ 'ఆధుని కాంధ్ర సాహిత్యంలో స్త్రీవాదం-పురుష రచయితలు' అన్న పరిశోధనా గ్రంథం.

మన విశ్వ విద్యాలయంలో జరుగు తున్న తెలుగు పరిశోధనలు పట్టా ప్రదానం దాటి బయట కు రావు. ముద్రితాలు తక్కువ. వాటిలో ప్రామాణికంగా వున్నవి మరీ తక్కువ. ఇలాంటివే యుజిసి వారి రీసెర్జ్ ప్రాజెక్టులు. ఇవీ ఎక్కువభాగం నివేదికలు సమర్పించడంతోనే సరి. ఈ నేపథ్యంలో 'ఆధునికాంధ్ర సాహిత్యంలో స్త్రీవాదం-పురుష రచయితలు' అనే విలక్షణమైన అంశం మీద యుజిసి ప్రాజెక్టు పూర్తి చెయ్యడమే కాకుండా గ్రంథంగా తీసుకొస్తున్నందుకు పరిశోధకురాలు డా॥సి. హెచ్. సుశీలమ్మ గారిని అభినందిస్తున్నాను.

తెలుగులో స్త్రీవాదం అనగానే ముందుగా గుర్తొచ్చే ప్రక్రియ కవిత్వం. గురి చూసి పాడే పాట, నీలిమేఘాలు, ముద్ర వంటి కవితా సంకలనాలు, భావకవిత్వంలో, స్త్రీ, స్త్రీల కవిత్వం- మనోభావాలు, తెలుగులో స్త్రీల సాహిత్యం, స్త్రీవాదం కవిత్వం- భాష, వస్తు, రూప నవీనత వంటి పరిశోధన గ్రంథాలు వెలువడ్డాయి. ఇవన్నీ స్త్రీలు స్త్రీల గురించి రాసుకున్న కవిత్వం, పరిశోధనలు. స్త్రీవాదం వచ్చిన కొత్తలో 'నీలిసాహిత్యం' అని కొందరు పురుషులు నిరసిస్తే, మరి కొందరు అంది పుచ్చుకుని అద్భుత రచనలు చేసారు!

సుశీలమ్మ గారి రచన విలక్షణత ఏమిటంటే తెలుగు స్త్రీవాద సాహిత్యం లో- పురుష రచయితల రచనలు పరిశీలించడం. ఈ అంశంపై తెలుగు పరిశోధన పెద్దగా దృష్టి సారించినట్లు లేదు. అస్తిత్వ ఉద్యమాలు రంగం మీది కొచ్చాక, దళితేతరులు రాసింది దళిత సాహిత్యం కాదు అనే చర్చ వాడిగా వేడిగా జరిగింది. అలాగే స్త్రీల గురించి పురుషులు రాసిన సాహిత్యం స్త్రీవాదంలోకి వస్తుందా రాదా అనే ప్రశ్న. ఈ అంశాలను పక్కనబెడితే వీటిని సంఘీభావ (సాలిడారిటీ) రచనలుగా గుర్తించవచ్చు.

జాగ్రత్తగా గమనిస్తే తెలుగు సాహిత్యంలో మొదటి నుండి ఒక వైరుధ్యం స్పష్టంగా కనిపిస్తుంది. ఏమిటంటే, జాతియోద్యమ కాలంలో హరిజనాభ్యు దయం గురించి రాసింది బ్రాహ్మణవాద రచయితలే! అలాగే స్త్రీ జనాభ్యుదయం గురించి రాసిన వాళ్లు కూడా పురుష రచయితలే! బహుశా వీరంతా తొలితరం విద్యావంతులు.

సంస్కరణ ప్రియులు కావడం ప్రధాన కారణం కావొచ్చు. స్త్రీలు రాయడం తాళ్లపాక తిమ్మక్క, మొల్ల, రంగాజమ్మ వంటి వారి కాలం నుండి వున్నా దళితులు రాయడం పన్నిద్దరు ఆళ్వారులలో ఒక్కడైన తిరుప్పాన్ అల్వారు, మరాఠీలో చోఖమేళా, హిందీలో సంత్ రవిదాస్ వంటి వారు కనిపిస్తారు. అయితే వీరంతా భక్తి సాహిత్యంలో అంతర్గత భాగస్వాములు-దళితులు రాయడం మాత్రం స్వాతంత్ర్యానికి పూర్వం, తర్వాత తొలితరం విద్యావంతులయిన కుసుమ ధర్మన్న, గుర్రం జాషువా, నక్క చిన వెంకయ్య, జ్ఞానానంద కవి, బోయి భీమన్న, కొలకలూరి ఇనాక్ వంటి వారు తమ అనుభవాలకు సాహిత్యరూపం ఇచ్చారు. ఈ చర్చ అంతా ఇక్కడ ఎందుకంటే స్త్రీల సాహిత్యం రాసిన పురుష రచయితలలో దళిత రచయితలు కూడా వున్నారు. వారు కుల సమస్యతోపాటు జెండర్ సమస్యను కూడా తమ దృష్టికోణం నుండి విశ్లేషించారు అని చెప్పడానికే!

ఈ గ్రంథంలో రచయిత్రి తెలుగు సాహిత్యంలోని అనేక ప్రక్రియలలో పురుషులు రాసిన స్త్రీవాద రచనలను స్పృశించి బేరీజు వేయడానికి ప్రయత్నించారు. చాలావరకు సఫలం అయ్యారు కూడా! అయితే ఒక్కొక్క ప్రక్రియపై ఒక్కొక్క గ్రంథం వెలువరించాల్సిన విషయ విస్తృతి కలిగిన అంశం ఇది. అయినా రచయిత్రి నిర్దిష్ట ప్రణాళికతో, ఆయా ప్రక్రియల్లో స్త్రీల స్థితిగతులపై పురుష రచయితల మనోభావాలను క్రోడీకరించి, విశ్లేషించి మనకు చూపుతుందీ గ్రంథం!


స్త్రీవాదాన్ని పరిచయం చేస్తూ రచయిత్రి ప్రాచ్య, పాశ్చాత్య రచయితలను ఉటంకించిన తీరు ఆమె వైదుష్యానికి అద్దం పడుతోంది. ఆయా ప్రక్రియలపరంగా ఇందులో గురజాడ, చలం, కొలకలూరి ఇనాక్, కె.శివారెడ్డి, పాపినేని శివశంకర్, ఐతా చంద్రయ్య, సలీం, భగ్వాన్, ఆసురాజేంద్ర, ఎండ్లూరి సుధాకర్ వంటి వారి రచనల విశ్లేషణ మనకు దర్శనమిస్తుంది.

అయితే రచయిత్రి, కె.శివారెడ్డి, ఇనాక్, సలీం వంటి వారి గ్రంత రచనలపై ఆధార పడినంతగా, స్త్రీల గురించి ఇతరులు రాసిన అసంకల్పిత రచనలను గుర్తించలేదేమో అని అనిపిస్తుంది. దీన్ని ఈ పరిశోధనకు పరిమితులుగా గుర్తించవచ్చు.

ఏది ఏమైనా ఇంతకుముందు పరిశోధకులు పెద్దగా దృష్టి సారించని "స్త్రీవాదం-పురుష రచయితలు" అంశాన్ని పరిశోధనకు స్వీకరించి, పూర్తి ఏసి గ్రంథ రూపంగా మన ముందుకు



-డా॥శిఖామణి
9848202526




ప్రతులకు:
డా॥సి. హెచ్. సుశీలమ్మ
214, నారాయణాద్రి,
ఎస్.వి.ఆర్.ఎస్. బృందావన్,
సరూర్‌నగర్,
హైదరాబాద్-500 035
సెల్: 98491 17879

## నాట్యశ్రీ అవార్డుల ప్రదానం




పురస్కార గ్రహీతలతో ఎఫ్‌టీవీపిసి చైర్మన్ మహ్మద్ షరీఫ్, శంకరరామిశెట్టి, నాట్య గురువు రాగరంజని తదితరులు

హైదరాబాద్, జనవరి 21: రాగ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నాట్యశ్రీ-2026 వార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీవీపిసి చైర్మన్ మహ్మద్ షరీఫ్, శంకర్ రామిశెట్టి ముఖ్య అతిథులుగా పాల్గొని నృత్యకారులకు నాట్యశ్రీ అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాగ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్, నాట్య గురువు రాగరంజని, జయశ్రీ పాల్గొన్నారు.




సంక్రాంతి సెలవులకు పట్టణంలో ఉంటున్న రాము తన తల్లిదండ్రులతో పాటు తాతయ్య వాళ్ళ ఊరికి వెళ్ళాడు.మొదట రాము తాను ఆ ఊరికి రానని, ఇక్కడనే ఉంటానని తల్లిదండ్రుల వద్ద మారాం చేశాడు.కానీ వారు అతనిని బుజ్జగించి ఈసారి సంక్రాంతి పండగను అక్కడే జరుపుకొని వారం రోజులలో తిరిగి వద్దామని రాముని వెంట తీసుకొని వెళ్లారు. అక్కడ పట్టణంలో ఉన్నవి ఏవీ అక్కడ అతనికి కనబడలేదు. రాము తల్లి ఆరోజు అతనికి ఇష్టమని గుత్తి వంకాయ కూరను చేసింది. రాము దానిని ఎంతో ఇష్టంగా తిన్నాడు. మరుసటి రోజు కూడా గుత్తి వంకాయ కూరనే చేసింది. రాము మళ్ళీ ఇష్టంగానే తిన్నాడు. ఇంకొకరోజు మళ్ళీ గుత్తి వంకాయ కూరనే చేసింది.రాము ఆశ్చర్యపోయి "అమ్మా! ఇక్కడ వంకాయలు తప్ప మరే కూరగాయలు దొరకవా!" అంటూ ప్రశ్నించాడు. అప్పుడు తల్లి "దొరుకుతాయి బాబూ! కానీ నీకు ఇష్టం కదాని ఈ గుత్తి వంకాయ కూరని వండాను" అని అంది. అప్పుడు రాము" అమ్మా! ఈ కూర నాకు ఎంత ఇష్టమైనప్పటికినీ మళ్లీ మళ్లీ తినలేక పోతున్నాను. కొంత విరామం ఇచ్చి ఈ కూరను వండు. అప్పుడు మళ్ళీ తింటాను"అన్నాడు. అది విన్నతల్లి "చూశావా బాబూ! ఒకే కూర తినడం వల్ల నీకు విసుగు పుట్టింది.అలాగే ఒకే ఊరిలో ఉంటే మాకు కూడా విసుగు వస్తుందిగా! అందుకే తాతయ్య ఇంటికి పోదామని ఈ ఊరు వచ్చాము. నీవు ఎక్కడికి వెళ్లినా సర్దుబాటు కావాలి. నీవు సాయంత్రం తాతయ్యతో పాటు వెళ్లి ఇక్కడి తోటలను, ఈ ఊరి ప్రకృతి అందాలను చూసి రా! ఇక్కడ ఆ కొండలు, వాగులు, ఆకాశంలో తిరిగే అందమైన పక్షులు, ఆ తెల్లని మేఘాలు, ఆ పచ్చని చెట్లు నీకు కనువిందు చేస్తాయి.ఇక్కడి సుందరమైన ప్రకృతి, చల్లని గాలి మన మనసుకు ఎంతో ఆహ్లాదం కలిగిస్తుంది.కాలుష్యం లేని స్వచ్ఛమైన గాలి వల్ల ఈ పల్లెటూరి వాతావరణం ఎంతో బాగుంటుంది. దానితో మన ఆరోగ్యం కుదుట పడుతుంది. ఇలాంటి ప్రకృతిని మనం కాలుష్యం నుంచి కాపాడాలి." అని అంది. "అలాగేనమ్మా!" అంటూ సాయంత్రం రాము తాతయ్యతోని అరటి తోటకు వెళ్ళాడు.అక్కడ అతడు ఆ ప్రకృతి దృశ్యాలను చూసి మైమరిచిపోయాడు. పట్టణంలో వలె అక్కడ రణ గొణ ధ్వనులు ఏమీ లేవు. చాలా ప్రశాంతంగా ఉంది. రాము అక్కడ కొన్ని అరటి పండ్లను దోసకాయలను తిని ఎంతో సంతోషించి ఇంటికి మరలి వచ్చాడు. తర్వాత అతడు "అమ్మా! ఇక్కడ మరికొన్ని రోజులు ఉందాం. ఈ పండగలో ఎంతో మంది నన్ను ఆప్యాయంగా పలకరించారు. ఈ ఊరు నాకు చాలా నచ్చింది. ఈ ప్రకృతి దృశ్యాలు చాలా సుందరంగా ఉన్నాయి. వాటిని వదల బుద్ధి కావడం లేదు. నీవు అన్నట్లు ఈ ప్రకృతిని మనం కాపాడాలి "అని అన్నాడు. అతని మాటలకు తల్లిదండ్రులు ఎంతగానో సంతోషించారు



-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535







# అంగరంగ వైభవంగా ఆవకాయ్ అమరావతి ఉత్సవం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సాహిత్యం, కళలు, సంస్కృతి, సంప్రదాయాలు భావవ్యక్తీకరణలకు పుట్టినిల్లుగా విరాజిల్లుతుంది. భాష, సంస్కృతి సినిమా కళావారసత్వ వైభవాన్ని ఆవకాయ్ అమరావతి సినిమా సంస్కృతి సాహిత్యాల ఉత్సవంగా నిర్వహించింది.

ఈ ఉత్సవం జనవరి 8వ తేదీ నుండి 10వ తేదీ వరకు మూడు రోజులపాటు, విజయవాడ నగరం లోని కృష్ణా నది ఒడ్డున కళకళలాడే పర్యాటకకే కేంద్రాలుగా తీర్చిదిద్దబడుతున్న పున్నమి ఘాట్, భవానీ ద్వీపంలో జరిగింది.

గౌరవ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు ప్రోత్సాహంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో పర్యాటక శాఖ, టీం వర్క్ ఆర్ట్స్ నిర్మాణ సారథ్యంలో విజయవాడ నగరం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కళాకారులతో సినిమా, సాహిత్య, వివిధ కళారంగాలలోని ప్రముఖులతో సందడి చేసింది.


మొదటి రోజు సాయంత్రం 5 గంటలకు పున్నమి ఘాట్ లో ఉత్సవ ఊరేగింపు జరిగింది. వేదిక పై భారీ తోలుబొమ్మలాట ప్రేక్షకులను అలరించింది. ఆ తర్వాత డ్రమ్స్ ప్రదర్శన జరిగింది.

జమ్మెర్స్ వారిచే సంగీత ప్రదర్శన ప్రేక్షకులను ఉర్రూతలూగించింది.

సభా కార్యక్రమానికి ముందు కృష్ణానది హారతి వేడుక కన్నుల పండువగా జరిగింది. తదనంతరం ఒమాజియో పర్ఫార్మింగ్ కంపెనీ వారి హర్ ఫ్లేమ్స్ హర్ ఫైర్ ప్రదర్శన బాగుంది.

కార్యక్రమంలో ముఖ్యఅతిథి నారా చంద్రబాబు నాయుడు సభను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ భౌగోళికంగా సుందరమైన ప్రాంతం అన్నారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఆవకాయ్ తెలుగు వారి సంస్కృతి, సాహిత్యం, సినిమా గొప్పతనాన్ని ప్రపంచానికి చాటుతు ందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం అభివృద్ధికి విస్తృతంగా కృషి చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో అద్భుతమైన కంపెనీలు నెలకొల్పబడు తున్నాయని, ఇక్కడ పెట్టుబడులు పెటడానికి చాలా మంది వస్తున్నారని యువతకు మంచి ఉద్యోగాలు లభిస్తాయని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ తెలుగువారి ఆరాధ్య కళాకారుడని గుర్తు చేశారు. ఈ చల్లని సాయంకాలం ఇంత గొప్ప గా వేడుక జరగడం తనకు చాలా ఆనందంగా ఉందని అన్నారు.






పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం చాలా కృషి చేస్తుందని, దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలుస్తుందని అన్నారు.

కార్యక్రమంలో యూరోపియన్ యూనియన్ రాయబారి హెచ్. ఈ. హెర్వే డెల్ఫిన్, టీం వర్క్ ఆర్ట్స్ పాలనాధికారి సంజయ్ కె. రాయ్ నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు.

రెండవ రోజు భవాని ద్వీపంలో.. ప్యూర్ ఈవిల్ ప్రతి నాయకులు శీర్షికన ఎస్. హుస్సేన్ జైదీ, యండమూరి వీరేంద్రనాథ్, సుధీర్ మిశ్రాతో చేసిన సంభాషణలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమానికి బాలాజీ విఠల్ హోస్ట్ గా వ్యవహరించారు. యండమూరి వీరేంద్రనాథ్ ప్రేక్షకులు ఉద్దేశించి చప్పట్లు కొట్టకపోతే సంసారాలు నాశనం అవుతాయని చేసిన సరదా వ్యాఖ్యలు కాస్త వేడి పుట్టించాయి. ప్రేక్షకుల నుండి ఒక మహిళ లేచి ఇలా అనడం భావ్యం కాదు అని అన్నారు.




కథ చెప్పే విధానం: భారతీ య పురాణాల ప్రయాణం శీర్షిక బ్నిం, కస్తూరి మురళీకృష్ణ, సంజీవ్ పస్రిచాతో మొతలి అను రాధ సంభాషణ అద్భుతంగా సాగింది.

కథ కాలక్షేపం స్టోరీ లో అవర్ యూకే వారిచే సంగీత రూపకం ప్రేక్షకులను అలరించింది. ఈ కార్యక్రమం నీలిమ అధ్యక్షతన జరిగింది.

ఓటిటి యుగంలో సినిమా శీర్షికన లీనా యాదవ్, శిభాశిష్ సర్కార్, సౌగుట ముఖర్జీ, మిత్ర సునీల్ చైనాని సంభాషణ జరిగింది.

అభిలాష నవల నుండి సినిమా వరకు శీర్షికన వల్లి పద్మాంజలితో యండమూరి వీరేంద్ర నాథ్ ఏ. కోదండ రామిరెడ్డి సంభాషణ ప్రేక్షకులను మంత్రము గ్ధులను చేసింది



రెండవ రోజు సాయంత్రం పున్నమి ఘాట్ లో చందన బాల కళ్యాణ్ గారిచే సాయంత్రపు సంగీత విభావరి చల్లని సాయం కాలనా ప్రేక్షకుల మనసు దోచింది.

నాటకీయ కథలు –రస ఐక్యం శీర్షికన వన శ్రీ రావు రచించిన కూచిపూడి నృత్యం శోభయమానంగా జరిగింది.

కథల శబ్దం: శీర్షికల సినిమాలలో సంగీతం ఉ కవిత్వం.. కాసర్ల శ్యామ్, రక్షంద జలీల్ ప్రియ సారయ్య, శేఖర్ రావ్జని, కాసర్ల శ్యామ్, ప్రియా సరైయ, పాయల మురళీకృష్ణ పాపులర్ మెరుతి, సైఫ్ నిజామి, సర్దార్ సలీం సంభాషణ ఆనందం గా కొనసాగింది.

ఆజ్ రంగ్ హై –ఏ వి జి నిజామి బంధు సంగీత విభావరి కె. శ్రీనివాసరావు, ఆచార్య జయ ప్రద, ఆచార్య తడకమళ్ళ విజయ్ కుమార్ అద్భుతంగా నిర్వహి ంచారు.

చివరి మూడవ మూడవ రోజు భవాని ద్వీపం సమావేశాల్లో కథా కాలక్షేపం శీర్షికన స్టోరీ ఎవరు యూకే వారి సంగీతం మాటలతో సార్వత్రిక కథలు భారతీయ సంప్రదాయ గొప్పతనాన్ని తెలియ జేశాయి.

కథ తరంగాలు శీర్షికన శ్రీకరుణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బ్నిం రామాయణంలోని వివిధ సన్నివేశాలను ఎంచుకొని కథాగమనాన్ని తెలియజే శారు.

శ్రీపతి శర్మ వస్తువును కథనంగా ఎలా విశ్లేషించాలో తెలియ జేశారు. మౌనశ్రీ మల్లిక్ సినిమా పాటల గురించి మాట్లాడుతూ.. సినిమాలో మాట ఎక్కడ ఆగిపో తుందో అక్కడ పాట మొద లవుతుందని తెలియజేశారు. మౌనశ్రీ రచించిన కొన్ని పాటల ను పాడి ప్రేక్షకులను అలరిం చారు. ఈ ముగ్గురి రచయితల సంభాషణ ప్రేక్షకులను అమి తంగా అలరించింది.

వర ముళ్ళపూడి, వడ్డీ ఓం ప్రకాష్ నారాయణ, శుక్రవారం రిలీజ్ సినిమా, జర్నలిజం అనే శీర్షికన భారతీయ సినిమా ప్రస్తుత పరిస్థితిని వివరించారు.

సుందర తెలుగు అని కార్యక్రమాన్ని అనురాధ మొతలి అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో కస్తూరి మురళీకృష్ణ మామిడి హరికృష్ణ, వర ముళ్ళపూడి, వేదాంతం శ్రీపతి శర్మ పాల్గొన్నారు. మురళీకృష్ణ వెనుకటి తం ం రచనల గురించి తెలుగు భాష గొప్పతనం గురించి అద్భుతమైన ప్రసంగం చేశారు. శ్రీపతి శర్మ పద్యాలలోని గొప్పతనాన్ని తెలియజేశారు.

వరా ముళ్ళపూడి మాట్లాడుతూ.. అలనాటి హాస్య రచనల గురించి చర్చించారు. మామిడి హరికృష్ణ తెలుగు భాష గొప్పతనం మీద, తెలుగు భాష సొగసు గురించి అనేక ఉదాహరణలతో మాట్లాడారు.

చౌరస్తా వారి సంగీత విభావరి, ఎన్టీఆర్ ప్రతిభకు నివాళి, జావేద్ అలీ పాటలతో కార్యక్రమాలు సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు సమాప్తం అయ్యాయి.

కార్యక్రమానికి అతిథులుగా వచ్చిన వాళ్లను బాలాజీ విఠల్ గొప్ప ఆతిథ్యాన్ని అందించేలా ఏర్పాటు చేశారు. ఎక్కడ చిన్న జరగలేదు.

దేశం మొత్తం తెలుగు వాళ్ళు పాల్గొనేలాగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

అయితే ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ముందుగా ఉచిత రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పిలుపునిచ్చారు.

అలా వేలాదిమందికి ఉత్సవంలో పాల్గొనే అవకాశాన్ని కల్పించారు. అది కొంతమంది స్థానిక రచయిత లకు నచ్చలేదు.

ఇంత పెద్ద ఉత్సవంలో ఎక్కడ చిన్న అపశృతి జరగకుండా జరపడం నిర్వాహకుల గొప్ప తనం.



–ఆరెల్లి స్వప్న
8919338546









# సామాజిక సంస్కరణా కవి వేమన



సభలో ప్రసంగిస్తున్న డా॥పాటిబండ్ల సత్యనారాయణ. వేదికపై డాక్టర్ సత్యనారాయణ ప్రసాద్, కళా జనార్ధనమూర్తి, సీనియర్ జర్నలిస్ట్ జయసూర్య తదితరులు.

హైదరాబాద్, జనవరి 21: నాలుగు చరణాలు ఆటవెలది పద్యాలతో లోతైన భావాలను సామాజిక సంస్కరణ కోసం చెప్పిన కవి వేమన అని విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ పాటిబండ్ల సత్యనారాయణ ప్రసాద్ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ లోని గుండవరపు హనుమంత రావు కళా వేదిక పై గాన సభ నిర్వాహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా యోగి వేమన యాది లో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వ అధికారి బ్రౌన్ వేమన పద్యాలు పరిస్కృతం చేయటం కోసం కృషి చేశారు అని చెప్పారు ప్రపంచ సాహిత్యం లో సోక్రటీస్ కి ఉన్న గుర్తింపు వేమనకి వుంటుందని బ్రౌన్ చెప్పిన మాటలు గుర్తు చేశారు ఐక్యరాజ్య సమితిలో వేమన ప్రపంచ కవులులో ఒకడుగా గుర్తింపు పొందారు అని చెప్పారు. వేమన శతకం పద్యాలులో కొన్ని ఇనా తెలియని వారు లేరు అన్నారు నేటి తరం వారికి వేమన శతక పద్యాలు నేర్పితే సమాజం పై మానవ సంబంధాల పై అవగాహన కలుగుతుంది వ్యక్తిత్వ వికాసం కు వేమన పద్యాలు ఉపయుక్తం అన్నారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై గాయకుడు శ్రీధర రామ సుబ్రహ్మణ్యం సీనియర్ పత్రికా రచయిత జయ సూర్య , రామ్ కుమార్ పాల్గొన్నారు

# అయోధ్య రామమందిర ప్రారంభ దినోత్సవం

కొత్త కాలచక్రానికి నాందిగా ఐదు శతాబ్దాల హిందువుల నిరీక్షణ తర్వాత శ్రీరాముడు అయోధ్యకు వచ్చిన రోజుగా 22 జనవరి 2024 భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన రోజుగా చరిత్ర పుటల్లో నిలిచి పోయింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా 22 జనవరి 2024 రోజు మధ్యాహ్నం భారత కాలమానం ప్రకారం 12:15 – 12:45 మధ్య పుణ్య గడియల్లో "అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం" అంగరంగ వైభవంగా, కోట్ల మంది హిందూ పౌర సమాజం అత్యంత భక్తి శ్రద్ధలతో చూస్తుండగా జరిగిపోయింది. బాలరాముడి రూపంలో ఉన్న రామ్ లల్లా అత్యద్భుత విగ్రహాన్ని గర్భగుడిలో ప్రాణ ప్రతిష్ట చేయడంతో ఆలయ ప్రారంభోత్సవం జరిగినట్లా అయ్యింది. 05 ఆగష్టు 2020 రోజు బాబ్రా మసీదు స్థలంలో నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన ఈ భవ్య దివ్య బాలరాముడి మందిర నిర్మాణం 250 అడుగుల వెడల్పు, 161 అడుగుల ఎత్తుతో నాగార శైలిలో 400 స్తంభాలు, 44 తలుపులతో మందిరాన్ని నిర్మించారు.

## ఐదు శతాబ్దాల సుదీర్ఘ పోరాటం :

1528లో మొఘల్ చక్రవర్తి బాబర్ కమాండర్గా పని చేసిన మీర్ బాకీ రామ మందిర స్థలంలో బాబ్రా మసీదును నిర్మించడంతో రామ మందిర ఉద్యమం మొదలయ్యింది. 1751లో మరాఠాలు అయోధ్య, కాశీ, మధుర మందిరాల నియంత్రణ కోరుకున్నారు. 1858లో నిహంగ్ సిక్కులు బాబ్రీ మసీదును రాముడి జన్మస్థలంగా వాదించడంతో ఘర్షనలు జరిగాయి. 1885లో నిర్మోహి అజారా పూజారి రఘుబర్ దాస్ మసీదు బయట రామాలయాన్ని నిర్మించాలని కోరుతూ మొదటి లీగల్ పిటీషన్ దాఖల చేసారు. 22 డిసెంబరు 1949రోజు రాత్రి మసీదు లోపల రామ్ లల్లా విగ్రహాలు ఉంచడంతో మందిర స్థల వివాదం కోర్టులో పడింది. 1950 – 59 మధ్య కాలంలో నిర్మోహి అఖారా విగ్రహాలను పూజించే హక్కులను కోరగా వక్ఫ్ బోర్డు ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి కోరింది. 1986లో రాజీవ్ గాంధీ నేతృత్వంలో బాబ్రీ మసీదు తాళాలను తెరిచారు. 1986 – 89ల మధ్య హిందువులు కూడా పూజలు చేసుకోవచ్చని అనుమతించారు. ఈ నిర్ణయం రామ జన్మభూమి వివాదం కీలక ఘట్టంగా మారింది. 1990లో విహెచ్పీ మందిర నిర్మాణానికి డెడ్లైన్ విధించడం, అద్వానీ రథ యాత్ర చేయడం, బాబ్రీ మసీదు కూల్చివేతకు విఫలయత్నం చేసారు. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం దేశవ్యాప్త అల్లర్లు 1994 వరకు కొనసాగాయి. 2002 – 03 మధ్య అలహాబాదు హైకోర్టు విచారణ ప్రారంభం కావడం, ఏఎస్ఐ తవ్వకాల చేసి మసీదు కింద రామాలయం ఉన్నట్లు రుజువులు చూపడం జరిగింది. 16 ఏళ్లలో లిబర్హాన్ కమిషన్ 399 సిట్టింగులతో నివేదిక సమర్పించింది. 2010లో అలహాబాదు హైకోర్టు తీర్పును ఇస్తూ హిందువులు, ముస్లింలు, నిర్మోహి అఖారాల మధ్య భూమిని విభజించి వివాదానికి తెర దించే ప్రయత్నం చేసింది.

ఐదు శతాబ్దాల పోరాటానికి స్వస్తి పలుకుతూ 2019 లో సుప్రీంకోర్టు వివాదాస్పద భూమిని హిందువులకు అప్పగిస్తూ, మసీదు నిర్మాణానికి ప్రత్యామ్నాయ స్థలాన్ని కోటాయించింది. ఇదే రామ జన్మభూమి పవిత్ర స్థలంలో 05 ఆగష్టు 2020 రోజు నరేంద్ర మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. ఇదే ఆలయ గర్భగుడిలో రామ్ లల్లా విగ్రాహాన్ని ప్రతి ష్టాపన చేసి హిందూ భక్తుల దర్శనానికి అందుబాటులోకి తెచ్చారు.

(22 జనవరి "అయోధ్య రామ్ లల్లా విగ్రహ ప్రాణ ప్రతిష్ట" జరిగిన రోజు సందర్భంగా)

–డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

ఆహ్వానం

తెలుగు సాహితీవనం ఆధ్వర్యంలో
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో
పుస్తక ఆవిష్కరణ సభ

విశ్వసాహిత్యం
ప్రపంచ ప్రఖ్యాత గ్రంథాల పరిచయం
(వ్యాస సంకలనం)
తెలుగు సాహితీవనం 10వ ప్రచురణ

సభాధ్యక్షులు
శాంతి కృష్ణ
ముఖ్య అతిథి
డా. సి. మృణాళిని
గ్రంథ పరిచయం
ఆడెపు లక్ష్మీపతి
ఆత్మీయ అతిథి
డా. కృష్ణారావు రెడ్నం

గౌరవ అతిథులు
అంపశయ్య నవీన్
ఏనుగు నరసింహారెడ్డి
చెలమచర్ల భాస్కర్ రెడ్డి
సత్యాజీ
స్వాతి శ్రీపాద
చమన్
సంపత్ కుమార్
కొల్లూరి సోమశంకర్

సమన్వయం
సుమన ప్రణవ్
వందన సమర్పణ
కంచిపాటి వెంకట్

తేదీ: 29.01.2026 గురువారం,
ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 1గంట వరకు
వేదిక: రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**

RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com